



సాహిత్య శిఖరం ఆమె.. విద్యాకుసుమం ఆమె..
అభ్యుదయ భావజాలమే ఆమె ఆభరణం..
తెలుగు భాషావృద్ధికి ఆమె కృషి అమోఘం..
సాగరతీరం కాకినాడలో ఎన్నో తరాలను
తీర్చిదిద్దిన సుజ్ఞాని ఆమె..
బతుకునిచ్చే పాఠాలు, జీవన వికాసానికి
పాటవాలు నేర్పిన ఉపాధ్యాయినిగా..
విద్య, సాహిత్య, సేవా రంగాలను
సమాజహితంగా ఏలిన మహారాణిగా..
సామాజిక దృక్పథమై అనేక వేదికలపై వినిపించిన సబలవాణి..
కాకినాడ ఐడియల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవినీ కుమారి..
ఆమె పరమపద సోపానం.. కాకినాడను దుఃఖసాగరంలో ముంచింది.
వయోభారంతో ఆమె వెడలినా.. ఆమె జీవన ప్రస్థానం..
వేనవేల మంది మదిలో.. కాకినాడ హృదిలో ఆమె 'చిరంజీవిని'..
అందుకే ఆమెను 'మదర్' ఆఫ్ కాకినాడ అనడంలో ఏ మాత్రం సందేహం లేదు..

చిరంజీవినీ కుమారి(ఫైల్)



కాకినాడ మదిలో చిరంజీవినే..

అస్తమించిన అభ్యుదయవాది చిరంజీవినీ కుమారి

94 ఏళ్ల వయసులో గుండెపోటుతో మృతి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అభ్యుదయవాది, సాహితీవేత్త, విద్యా రంగానికి మార్గదర్శకురాలు, సామాజికవేత్త, కాకినాడలోని ఐడియల్ విద్యాసంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి(94) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో ఇంటివద్ద తుదిశ్వాస విడిచారు. 1931 మార్చి 30న ఆమె జన్మించారు. చిరంజీవినీకుమారి భర్త పేరు పాలెపు శర్మ.. స్వాతంత్ర్య సమరయోధుడు..ఆయన కొన్నేళ్ల కిందట మరణించారు. వీళ్లకి ఇద్దరు కుమారులు.పెద్ద కుమారుడు పీబీఎస్ గోపాల్ వృత్తిరీత్యా వైద్యుడు విదేశాల్లో ఉంటున్నారు. చిన్నకుమారుడు పీఎస్ఎస్ కిరణ్.. కాకినాడలోనే ఉంటూ కుటుంబ వ్యాపారాలు చూసుకుంటున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా చిరంజీవినీ కుమారి గుర్తింపు పొందారు. మానవ మనుగడకు మూలాలే ప్రధానం.వాటిని అసలు మరిచిపోకూడదనే ఆమె.. ఆస్తులను పంచి ఇచ్చినట్టుగానే వాటిని పిల్లలకు పంచి ఇవ్వాలని చెబుతూ ఉండేవారు. ఆమె మానవ విలువలపైనే వేదికలపై ప్రసంగించేవారు.మానవసంబంధాలు మృగ్యమైపోతున్నాయని వాటిని కాపాడాలని పదే పదే చెప్పేవారు. తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా జిల్లాలో భాషా సాహిత్యాభివృద్ధికి విశేష కృషి చేశారు. ఐడియల్ కళాశాలలో తెలుగు భాషను మాత్రమే ద్వితీయ భాషగా కొనసాగిస్తూ తెలుగు భాషా సంస్కృతి వికాసానికి ఎనలేని సేవలందించారు.మహాకవి శ్రీశ్రీ షష్టిపూర్తి, వెయ్యేళ్ల తెలుగు సాహిత్య వేడుకలు, డాక్టర్ గరికిపాటి నరసింహారావు మొదటి సహస్రావధానం మొదలైన కార్యక్రమాలు ఐడియల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలోనే నిర్వహించారు. కాకినాడ రూరల్ మండలంలోని కొవ్వాడ గ్రామాన్ని దత్తత తీసుకుని అక్కడ యువతకు ఉపాధికి కృషి చేశారు. మహిళలు, పిల్లలు, తదితర యువతీయువకుల్లోని ప్రతిభాపాటవాలను వెలికితీయిస్తున్నారు.

1970లో కళాశాల పెట్టి..

కాకినాడ జిల్లా కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలిగా కొంతకాలం పనిచేసిన చిరంజీవినీ కుమారి డాక్టర్ పీవీఎస్ రాజుతో కలిసి 1970లో ఐడియల్ జూనియర్ కళాశాలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖులు ఈ కళాశాలలో చదివిన వారే. నేడు డిగ్రీ, ఇంజినీరింగ్ కళాశాలల్లో ఎంతో మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆమె కాకినాడ అన్నవరం సత్యవతీదేవి మహిళా కళాశాల ఫౌండర్ మెంబర్‌గా, ఐడియల్ జూనియర్, డిగ్రీ కళాశాల, ఐడియల్ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌కు ఫౌండర్ సెక్రటరీగా, ఐడియల్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఫౌండర్ మెంబర్ ఆఫ్ ఏయూ పీజీ సెంటర్ కాకినాడ, ఏపీ స్టేట్ ప్రైవేట్ కాలేజీస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, వేణుగోపాల సంస్కృత ప్రచార సభ కాకినాడ సెక్రటరీగా, తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంఘం సెక్రటరీగా, గిరిజన ప్రాంతంలోని 'స్పందన' స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్‌గా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా, రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సభ్యురాలిగా, జనవిజ్ఞాన వేదిక స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య సభ్యురాలిగా, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ సాధన సమితి వైస్ ప్రెసిడెంట్‌గా, జిల్లా అక్షరాస్యత సమితి 'అక్షర గోదావరి' సభ్యురాలిగా, జిల్లా విద్యాకమిటీ, జిల్లా టి.బీ. నియంత్రణ కమిటీ, జిల్లా అధికార భాషా సంఘం సభ్యురాలిగా ఎలా ఎన్నో పదవులను ఆమె చేపట్టారు. 2005లో న్యూఢిల్లీ వారు మదర్ ఇండియా జాతీయ అవార్డు అందజేశారు.హైదరాబాద్‌లో తుమ్మల వెంకట్రామయ్య సాహితీ సత్కారం, 2011లో శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తిపురస్కారం, 2012లో షీ ఫౌండేషన్ హైదరాబాద్ వారు ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్,ఉమెన్ పురస్కారం అందజేశారు. 2014లో ఐ.పోలవరంలోని పుల్లెల తాతయ్య మెమోరియల్ అసోసియేషన్ వారు ఇంటిగ్రల్ హ్యూమనిస్ట్ అవార్డు అందజేశారు.



చిరంజీవినీ కుమారి భౌతికకాయం వద్ద నినాదాలు చేస్తున్న వామపక్ష నాయకులు

ఎన్నో రచనలు..

రచయితగా అనేక పుస్తకాలు రచించారు. 3-బుక్స్ ఆఫ్ తెలుగు పొయిట్రీ, బుక్ ఆఫ్ పోయమ్స్ ఆఫ్ 32 ఉమెన్ రైటర్స్ ఆఫ్ సోవియట్ ల్యాండ్ 'లేత మందారాలు.. రక్త సిందూరాలు',ఏ బుక్ ఆఫ్ స్టోరీస్ ట్రాన్స్‌లేటెడ్ ఫ్రమ్‌ఆర్మీనియన్ రైటర్స్ ఎస్సై షల్లీ తుమాన్యాన్..'ఆర్మీనియా కథలు- గాథలు '..'తూర్పుగోదావరి జిల్లా చరిత్ర- సం స్కృతి', గోదావరి కథలు-అలలు(తూర్పుగోదావరి జిల్లా కథల సంకలనం),ఎ రైటర్ ఆఫ్ అబౌట్ 80 ఎస్సేస్ ఇన్ ఏరియా ఆఫ్ లిటరేచర్, సోషల్ అండ్ ఉమెన్ ఏస్పెక్ట్స్, అబౌట్ 20 రేడియో టాక్స్ (మంచి వక్త, విమర్శకురాలు) ఉన్నాయి.

నేడు అంత్యక్రియలు

కాకినాడ ప్రతాప్‌నగర్‌లోని ఆమె నివాసం నుంచి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు చిరంజీవినీ కుమారి భౌతికకాయాన్ని ఊరేగింపుగా ఇంద్రపాలెం లాకుల వద్ద గల ఐడియల్ కళాశాలకు తీసుకెళ్లనున్నారు. విద్యార్థులు, ప్రముఖుల సందర్శనార్థం ఆమె పార్థివదేహాన్ని అక్కడ ఉంచనున్నారు. అక్కడి నుంచి 3 గంటలకు శ్మశానానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కళాశాల గవర్నింగ్ బాడీ తెలిపింది.

ఐపీఎల్ షో అదిరే!

కాకినాడలో క్రికెట్ సందడి..

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆదివారం క్రికెట్ అభిమానులతో సందడి నెలకొంది. క్రికెట్ ప్రేక్షకుల కోసం బీసీసీఐ దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా కాకినాడలో ఏర్పాటు చేసిన ఐపీఎల్ లైవ్ మ్యాచ్ వీక్షణకు పది వేల మంది క్రికెట్ అభిమానులు విచ్చేసినట్టు అంచనా. వర్షం కారణంగా మ్యాచ్ ఆలస్యం కావడంతో కొంతమంది నిరాశతో వెనుదిరిగారు. వర్షం తగ్గిన తర్వాత 9.45 గంటలకు పంజాబ్, ముంబాయి జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభం కావడంతో అధిక సంఖ్యలో క్రికెట్ అభిమానులు తరలివచ్చి ఆనందంగా వీక్షించారు.రాజ్యసభ ఎంపీ, ఏసీఏ సెక్రటరీ సానా సతీష్‌బాబు పట్టుదలతో ఐపీఎల్ ఫైనల్ లైవ్ స్క్రీనింగ్ చూసే ఏకైక ఫ్యాన్ పార్క్ కాకినాడలో ఏర్పాటు చేశారు.లైవ్ మ్యాచ్ స్క్రీనింగ్,ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, డీజే సంగీతం, ఫుడ్‌కోర్ట్స్,కుటుంబ వినోదం ఉన్నాయి.కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పంతం నానాజీ,ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ,కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జేసీ రాహుల్ మీనా తదితరులు వచ్చారు.



ఎక్కడైనా రేషన్!

రేషన్ పంపిణీ ప్రారంభంలో మంత్రి నాదెండ్ల మనోహర్

- వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్
- ఉదయం 8 నుంచి పంపిణీ
- డీలర్ల అవకతవకలు సహించం
- ప్రజలు ఫిర్యాదు చేయవచ్చు
- డిపో వద్ద నెంబర్ల ఏర్పాటు
- బియ్యం స్మగ్లింగ్ చేస్తే పీడీ యాక్ట్
- 21 రోజుల్లో కొత్త కార్డులు





సర్పవరంలో వృద్ధుడి ఇంటికెళ్లి రేషన్ పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల.. ఉండ్రాజవరంలో రేషన్ పంపిణీ చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

పిఠాపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కార్డుదారులు తమకు నచ్చిన లేదా దగ్గరగా ఉన్న చౌక ధరల దుకాణం ద్వారా సరుకులు తీసుకునే అవకాశాన్ని కల్పించామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. పిఠాపురం నూకాలమ్మ గుడి వీధి 18వ వార్డులో చౌక ధరల దుకాణం ద్వారా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా సరుకుల పంపిణీని ప్రారంభించారు.ఈ పోస్ యంత్రంపై కార్డుదారులు వేలిముద్ర వేసిన తర్వాత వారికి సరుకులను అందజేసి మాట్లాడారు. ప్రతి దుకాణానికి నిర్దేశించిన కోటా కంటే అదనంగా పదిశాతం సరుకులు పంపామని చెప్పారు. చౌక ధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీలో ఎక్కడ తప్పు జరిగినా తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. కార్డుదారులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా అన్ని అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతి చౌక ధరల దుకాణం వద్ద డీలరు పేరు, షాపు నెం బరు ఇతర వివరాలు ప్రదర్శించడంతో పాటు వాటిపైనే డీఎస్‌వో, తహశీల్దార్, ఇతర అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ ఫోన్ల ద్వారా లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సరుకుల పంపిణీలో ఫిర్యాదులు, సలహాలు, సూచనలు ఉండే తెలపవచ్చునని చెప్పారు. తూకం, సరుకుల నాణ్యత తదితర అంశాల్లో లోపాలు ఉన్నా, సమయానికి తెరవకున్నా ఫిర్యాదు చేస్తే తక్షణం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వీటిని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ నేతృత్వంలోని కేంద్ర కార్యాలయం నిరంతరం సమీక్షిస్తూ ఉం టుందని తెలిపారు. రేషన్ డిపోల ద్వారానే కార్డుదారులకు నిజాయితీగా సరుకులు అందు తాయని చెప్పారు. కాకినాడ పోర్టు ద్వారా జరిగే బియ్యం స్మగ్లింగ్ అరికట్టామని, అక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. బియ్యం స్మగ్లింగ్‌పై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. రేషన్ షాపులు ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ ప్రతి రోజూ ఉదయం 8నుంచి 12 గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ తెరిచి ఉంటాయని తెలిపారు. కాకినాడ జిల్లాలో 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు 71 వేల మంది ఉన్నారని గుర్తించామని, వీరికి ప్రతి నెలా 5వతేదీ లోగా సరుకులు అందించి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. పింఛన్ల పంపిణీ మాదిరిగా గంటగంటకు, ప్రతి రోజూ సరుకుల పంపిణీ వివరాలు తెలిపేందుకు ప్రత్యేక యాప్ రూపొందించామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. కొత్తకార్డులు, సభ్యులు చేర్పు, తొలగింపు, చిరునామాల మార్పు తదితరాల కోసం చేసిన దరఖాస్తులను 21 రోజుల్లో పరిష్కరించి కొత్తకార్డులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పం తం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్,కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, జేసీ రాహుల్ మీనా,పాడా పీడీ చైత్రవర్షిణి, 18వ వార్డు కౌన్సిలరు పంపనబోయిన అన్నపూర్ణ పాల్గొన్నారు.



కోట సత్తెమ్మకు పూజలు

నిడదవోలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం భక్తులతో ఆలయం కళకళలా డింది.అమ్మవారికి రూ.1,88,977లు ఆదాయం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వహ ణాధికారి వి.హరి సూర్యప్రకాష్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు. అమ్మ వారికి ఆదివారం జంగారెడ్డిగూడెంనకు చెందిన కోసూరి దశరథరావు, నాగమణి దంపతులు,కుమారుడు కోసూరి రాజేష్ బాబు అరకేజీ వెండి అందజేశారు.

రేపు వికాస జాబ్ మేళా

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వికాస ఆధ్వర్యంలో ఐటీసీ లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్ కంపెనీలలో ఆపరేటర్ జాబ్స్‌కు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస పీడీ కే .లచ్చారావు తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఉద్యోగాలకు ఐటీఐ, ఇంటర్(ఒకేషనల్) ఉత్తీర్ణులై 30 సంవత్సరాల్లోపు వయసు గల పురుష ,మహిళ అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 3న ఉదయం 9:30 గంటలకు విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో నేరుగా హాజరుకావాలని తెలిపారు. వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వికాస్ జాబ్స్.కం లేదా సెల్ 76608 23903ను సంప్రదించాలని కోరారు.



నేడో..రేపో

ఓపెన్ రీచ్‌లు నిలిపివేత?

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

వర్షాకాలం ఆరంభం కావడంతో ఉమ్మడి గోదావరి జిల్లా పరిధిలోని ఓపెన్ ఇసుక రీచ్‌లన్నీ మూసివేయనున్నారు. ఈ మేరకు రేపో మాపో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. మొత్తం 24 ఓపెన్ రీచ్‌లు మూత పడుతున్నట్టు సమాచారం. ఇక 18 డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా మాత్రమే ఇసుక తీస్తారు. ప్రస్తుతం ఓపెన్ రీచ్‌లు, డీసిల్టేషన్ పాయింట్లలో కూడా ఇసుక అక్రమాలు జోరుగా సాగుతున్నాయి.అఖండ గోదావరిలో అక్రమ డెడ్జింగ్ సాగుతోంది.ఇక నైరుతీ రుతుపవనాలు ప్రవేశించడం,వర్షాలు రానుండడంతో గోదావరికి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున రేపో మాపో అధికారికంగా ఓపెన్ రీచ్‌లు మూసివేసే అవకాశం ఉంది. జిల్లా,ఇతర ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేసిన 13 స్టాక్ పాయింట్లు ద్వారా ఇసుక విక్రయాలు జరుపుతారు. ఇప్పటికే అక్కడ ధరలు కూడా నిర్ణయించారు. కానీ వీటిని సోమవారం అధికారికంగా ప్రకటించనున్నారు.. వర్షాకాలంలో ఇసుక ఇబ్బంది లేకుండా స్టాక్ పాయింట్లలో నిల్వ చేశారు. వర్షాలు వచ్చినా డీసిల్టేషన్ తీసే అవకాశం ఉన్నందున అక్కడ పని కొనసాగుతోంది. బాగా వరదలు వస్తే ఆగిపోతుంది. స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఓవర్ లోడింగ్,అనధికార ఇసుక రవాణా మార్గాలపై పోలీసులు కఠిన నిఘా పెట్టాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మరో పక్క గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 మే నుంచి 2024 మే వరకూ జిల్లాలో జరిగిన అక్రమ తవ్వకాలపై విచారణ మొదలైంది.

కాలువలకు జలకళ

గోదావరి నుంచి నీటి విడుదల

7



కూటమి వశం కానున్న నిడదవోలు వైస్ చైర్మన్ పదవి

- నేడు వైస్ చైర్మన్ పదవికి ఎన్నిక
- కౌన్సిల్‌లో 15కు పెరిగిన బలం
- రతీదేవి, కారింకి మధ్య పోటీ

నిడదవోలు, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మునిసిపల్ వైస్‌చైర్మన్ పదవి కూటమి వశం కానుంది.ఇప్పటి వరకూ వైసీపీ ఖాతాలో నిడదవోలు వైస్‌చైర్మన్ పదవి ఉండేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న గంగుల వెంకటలక్ష్మి వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేసి జనసేన తీర్థం పుచ్చుకున్నారు.ప్రస్తుతం వైసీపీకి చెందిన యలగాడ బాలరాజు వైస్ చైర్మన్‌గా ఉన్నారు. ఇదిలా ఉండగా సోమవారం కౌన్సిల్‌లో వైస్‌చైర్మన్ పదవిపై ప్రత్యక్ష ఎన్నికలకు దిగుతున్నారు. మునిసిపల్ కౌన్సిల్‌లో 14 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉండగా ఒకరు విదేశాలకు వెళ్లడంతో ప్రస్తుతం 13 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చిన 13 మంది కౌన్సిలర్లు ఉండగా టీడీపీకి చెందిన ఒక కౌన్సిలర్, మంత్రి దుర్గేష్‌కు ఓటు హక్కు ఉండడంతో కూటమి బలం 15కి చేరింది.ఈ నేపథ్యంలో నేడు వైస్‌చైర్మన్ గిరీపై జరిగే ప్రత్యక్ష ఎన్నికలో కూటమి అభ్యర్థి విజయం సాధించేందుకు అన్ని అవకాశాలు మెండుగా ఉన్నాయి.వైస్ చైర్మన్ పదవికి పువ్వుల రతీదేవి,కారింకి నాగేశ్వరరావు పోటీపడుతున్నారు. మునిసిపాలిటీలో సోమవారం జరగనున్న వైస్‌చైర్మన్ ఎన్నికల ప్రక్రియపై కమిషనర్ తోట కృష్ణవేణి ఎటువంటి సమాచారాన్ని తెలియచేయకుండా వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

ఎమ్మెల్యే లేక ఆగిన రేషన్?

రాజమండ్రిలో నేటి నుంచి పంపిణీ

రాజమహేంద్రవరం, జూన్1 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం సిటీలో ఆదివారం రేషన్ పంపిణీ జరగలేదు. నగరంలో ఉన్న 105 చౌకధరల డిపోలు వద్దకు అధికారులు వచ్చి కేవలం లాగిన్ అయ్యారు. రెండు మూడు కార్డులకు మాత్రమే సరుకులు సరఫరా చేసినట్టు చెబుతున్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వేరే ప్రాంతాల్లో ఉండడంతో ఆదివారం రాలేకపోవడంతో ఆగినట్టు సమాచారం. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ లాలాచెరువు, రాందాసుపేట,తుమ్మలోవ,అంబేద్కర్ నగర్‌లలో రేషన్ పంపిణీ ప్రారంభిస్తారు.



ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా

నేడు జవహర్ ప్రమాణస్వీకారం

కొవ్వూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నట్టు మాజీ మంత్రి కె.ఎస్. జవహర్ తెలిపారు. కొవ్వూరులో నివాసం నుంచి సోమవారం ఉదయం 7 గంటలకు విజయవాడ ర్యాలీగా వెళతామన్నారు. ఆదివారం జవహర్‌ను ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, గోపాలపురం ఎమ్మార్పీఎస్ నాయకులు కలిశారు.

ఎన్జీవో సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడు

విద్యాసాగర్‌కు ఘన సత్కారం


విద్యాసాగర్‌ను గజమాలతో సత్కరిస్తున్న ఎన్జీవో సంఘ నేతలు

కాకినాడ సిటీ, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ప్రమాణం చేసిన ఆలపాటి విద్యాసాగర్‌ను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా ఎన్జీవో సంఘ నేతలు ఆదివారం గజమాలతో ఘనంగా సత్కరించారు. విజయవాడలో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవానికి జిల్లా నుంచి పలు వురు నేతలు తరలి వెళ్లారు. ఆయన మరిన్ని పదవులు అధిరోహించాలని పలువురు అన్నారు. కార్యక్రమంలో ఎన్జీవోల సంఘ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు, జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్, ఉమ్మడి జిల్లా సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, ఏపీటీఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు పాము శ్రీనివాస్ , తదితరులు పాల్గొన్నారు.

లోవకు పోటెత్తిన భక్తులు

● ఆలయానికి రూ.6.83 లక్షల ఆదాయం





తునిరూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. వేకువజామునే తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చారు. ప్రత్యేక క్యూలైన్‌లో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దీనిలో భాగంగా వివిధ విభాగాల ద్వారా రూ.6.83 లక్షల ఆదాయం సమకూరినట్టు ఈవో విశ్వనాథ్‌రాజు తెలిపారు.

క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు, తలుపులమ్మ వారు

భార్య అదృశ్యంపై భర్త ఫిర్యాదు

అమలాపురం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): భార్య అదృశ్యంపై భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అమలాపురం మండలం రోళ్లపాలెం గ్రామానికి చెందిన ఉంగ్రాజవరపు నందిని (21) గత నెల 30న చర్చికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లింది. భార్య ఆచూకీ తెలియకపోవడంతో ఆదివారం అమలాపురం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మూడేళ్ల క్రితం నందిని, జగదీష్ ప్రేమ వివాహం చేసుకున్నారు.

కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

● గోదావరి నదిలో మునిగి ఒకరు... రోడ్డుప్రమాదంలో మరొకరు... క్వారీలో జారిపడి ఇంకొకరు.. రైలు ఢీకొని యువకుడు..


గోదావరి నది నుంచి మృతదేహాన్ని బయటకు తీస్తున్న స్థానికులు

కొవ్వూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని కొవ్వూరు పట్టణ పోలీసులుఆదివారం సాయంత్రం గుర్తించారు. స్థానిక లాంచీలరేవు సమీపంలో మృతదేహం తేలి ఉందని సమాచారం రావడంతో పట్టణ సీఐ పి. విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా గుంటూరు జిల్లా మంగళగిరి బాలాజీనగర్‌కు చెందిన మందిశెట్టి శ్రీనివాసరావు (55)గా గుర్తించారు. ఈమేరకు ఆయన కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసినట్టు పోలీసులు తెలిపారు.

నల్లమెటల్ క్వారీలో...

రౌతులపూడి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మూలగపూడి సర్వేనెంబర్- 1లో గల నల్లమెటల్ క్వారీలో పడి ఆదివారం ఒక వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అనంతపురం జిల్లాకు చెందిన వడ్డే ఉమామహేష్ (37) విష్ణు మెటల్ గ్రానైట్ అండ్ సప్లయర్స్‌లో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఆదివారం క్వారీలో డ్రిల్లింగ్ చేస్తుండగా జారిపడి తీవ్ర గాయాలపాలయ్యాడు. దీంతో హుటాహుటిన కాకినాడ ఆసుపత్రికి తరలిస్తుండగా మృతిచెందినట్టు ఎస్ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అనంతపల్లి హైవేలో...

నల్లజర్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నల్లజర్ల మండలంలోని అనంతపల్లి హైవేలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశరావు పాలెంకి చెందిన చికిలే వెంకటేష్ (34) అక్కడికక్కడే మృతిచెందాడు. ఈయన యర్నగూడెం వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వ్యాన్ ఢీకొంది. దీంతో కుటుంబ సభ్యులు భోరున విలపిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

రైలు ఢీ కొని ..

తుని రూరల్, జూన్1 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన తుని రైల్వేపోలీస్‌స్టేషన్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. రావికంపాడు - పిఠాపురం రైల్వేస్టేషన్ల మధ్య విశాఖపట్నం నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న గుర్తుతెలియని రైలు సుమారు 35 సంవత్సరాలు వయస్సుగల వ్యక్తిని ఢీ కొట్టగా ఆయన అక్కడికక్కడే మృతి చెందినట్టు రైల్వే ఎస్ఐ జి. శ్రీనివాస్ తెలిపారు. మృతుడు పింక్ కలర్ టీషర్ట్, నీలం రంగు జీను ప్యాంట్ ధరించినట్టు ఆయన వెల్లడించారు. ఈయన సంబంధీకులు ఉంటే తుని రైల్వే పోలీసులను సంప్రదించాలని ఎస్ఐ సూచించారు.


రథంపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

సత్యదేవుడికి వేడుకగా రథోత్సవం

అన్నవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రత్నగిరి వాసుడైన సత్యదేవుడికి ఆదివారం స్వామి వారి ఆర్జిత సేవ రథోత్సవం వేడుకగా జరిగింది. ఉదయం స్వామి, అమ్మవార్లను రథంపై ఆశీనులు గావించి ప్రత్యేక పూజల అనంతరం తూర్పురాజగోపురం చుట్టూ ముమ్మారు ప్రదక్షిణ గావించారు. అనంతరం హారతులిచ్చి తిరిగి స్వామి అమ్మవార్ల ఉత్సవమూర్తులను ప్రధానాలయానికి తీసుకెళ్లారు.

విద్యార్థుల అపూర్వ కలయిక


వేళంగి హైస్కూల్‌లో కలుసుకున్న 1999-2000 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు

కరప, జూన్1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కరప మండలం వేళంగి మెర్లాస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక జరిగింది. 1999- 2000 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు కుటుంబ సమేతంగా కలుసుకుని ఆనాటి జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన తెలుగు తల్లి విగ్రహాన్ని అప్పటి ప్రధానోపాధ్యాయులు నేమాని వెంకటరామారావు, పట్టాభిరామారావు ఆవిష్కరించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను బాణసంచా కాల్పుల నడుమ పూలబాటలో వేదిక వరకు సాదరంగా ఆహ్వానించి ఘనంగా సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. అనంతరం వారితో కలిసి గ్రూపు ఫొటోలు తీయించుకుని సందడి చేశారు. దీనిలో భాగంగా పలువురు మాట్లాడారు. అసోసియేషన్ ఆఫ్ ఫ్రెండ్స్ ఫర్ ఎవర్ ఆధ్వర్యంలో కేవీవీఎస్ఎస్ గుణేశ్వరరావు(గుణ) అధ్యక్షతన జరిగిన ఆత్మీయ స్నేహ సమ్మేళనంలో మెర్ల వీరయ్యచౌదరి, డాక్టర్ బొండా వెంకన్నరావు, హెచ్ఎం కె.భారతి, పూర్వ విద్యార్థులు గరగ అనిత, హేమారావు, వనుం ఉపేంద్రనాథ్, కడలి లోవరాజు, బి.సతీష్, సీతాలక్ష్మి, తాతాజీ, అడపా వెంకటేశ్వరరావు, చుండ్రు మంగాదేవి, సత్యవతి, వీరలక్ష్మి, శేషవతి, కార్తీక, బి.శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భారీ తాచుపాము హల్‌చల్

● భయాందోళన చెందిన వాకలగరువు గ్రామస్థులు


వాకలగరువులో పామును పట్టుకున్న స్నేక్‌క్యాచర్ గణేష్ వర్మ

అంబాజీపేట, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం వాకలగరువులో భారీ తాచుపాము ఆదివారం హల్‌చల్ చేసింది. గ్రామానికి చెందిన జొన్నాడ ఈశ్వరరావు ఇంటి వద్ద ఐదు అడుగుల గోధుమ నాగు కనిపించడంతో స్నేక్ క్యాచర్ గణేష్‌వర్మకు సమాచారం అందించారు. ఆయన వచ్చి పామును బంధించి జన సంచారం లేని ప్రదేశంలో వదిలాడు.

బైకును దౌర్జన్యంగా తీసుకెళ్లిన వ్యక్తులపై కేసు

అమలాపురం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): మోటారుబైకును దౌర్జన్యంగా తీసుకువెళ్లిన వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈదరపల్లి ఆర్ఆర్‌నగర్‌లో మోటారు బైకు మెకానిక్‌గా షేక్ మజీద్‌బాషా పనిచేస్తున్నాడు. పి.గన్నవరం మండలం కె.ముంజవరం గ్రామానికి చెందిన అడబాల నారాయణ ఐదు నెలల క్రితం రాయల్‌ఎన్‌ఫీల్డ్ మోటారు బైకును మరమ్మతుల నిమిత్తం ఇచ్చాడు. ఎంతకు మోటారుసైకిల్‌ను బాగుచేసి ఇవ్వకపోవడంతో మెకానిక్ వద్దనున్న వేరొకరికి చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటారుసైకిల్‌ను స్నేహితులతో కలిసివచ్చి దౌర్జన్యంగా తీసుకువెళ్లాడు. నజీబ్‌బాషా ఫిర్యాదు మేరకు నారాయణతో పాటు మరో ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ పి.వీరబాబు తెలిపారు.

మినీ మాల్స్‌గా రేషన్ దుకాణాలు!

వలసపాకలలో వృద్ధుడి ఇంటికెళ్లి రేషన్ అందించిన మంత్రి నాదెండ్ల, ఎమ్మెల్యే నానాజీ



వలసపాకలలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల

సర్పవరం జంక్షన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): 'పేదల ఆహార భద్రతకు ప్రభుత్వం కట్టుబడి ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చాక స్వలాభం కోసం ఎండీయూ వ్యవస్థను తీసుకొచ్చి బలమైన ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో రేషన్ కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ప్రజల ఆకాంక్షల మేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ ఎండీయూ స్థానే రేషన్ షాపులను పునఃప్రారంభించారు.. భవిష్యత్‌లో వాటిని మినీ మాల్స్‌గా చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది' అని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ఆదివారం ఆయన కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం వలసపాకలలో సూరంపూడి కిషోర్‌కు చెందిన 56వ నెంబరు రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే పంతం నానాజీ, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, పౌరసరఫరాల శాఖ కమిషనరు సౌరవ్‌గౌర్, జేసీ రాహుల్ మీనాలతో కలిసి నాదెండ్ల ప్రారంభించారు. వాసంశెట్టి గోపాల్ అనే వృద్ధుడి ఇంటికెళ్లి 20 కిలోల బియ్యం, పంచదార, నిత్యావసరాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే నానాజీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, రాగులు, మిల్లెట్లు, సజ్జలు, జొన్నలు, కొర్రలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, తహసీల్దారు కుమారి, ఎంపీడీవో పి.సతీష్, మాజీ మంత్రి రామచంద్రరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, కటకంశెట్టి ప్రభాకర్ (బాబీ), నులుకుర్తి వెంకటేశ్వరరావు, జీని శ్రీనివాస్, కరెడ్ల గోవిందు, జిల్లా రేషన్ డీలర్ల వర్కింగ్ ప్రెసిడెంట్ కోటిపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీలేరు నదిలో చిక్కుకున్న యువకులు

- రక్షించిన పోలీసులు, మోతుగూడెం ఎంపీటీసీ బృందం
- పొల్లూరు జల విద్యుత్ కేంద్రంలో గంటపాటు ఉత్పత్తి నిలుపుదల


నదిలో చిక్కుకున్న యువకులను రక్షించిన ఎస్ఐ, ఎంపీటీసీ బృందం

మోతుగూడెం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సీలేరు నదీ ప్రవాహంలో చిక్కుకున్న యువకులను ఎంపీటీసీ బృందం రక్షించింది. హైదరాబాద్, సామర్లకోట నుంచి ఆదివారం వచ్చిన ఆరుగురు యువకులు అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం సమీపంలోని దారాలమ్మ పిక్నిక్ స్పాట్ వద్ద స్నానాలకు దిగారు. కేరింతలు కొడుతున్నారు. ఈ క్రమంలో విజయవాడ విద్యుత్ సౌధ లోడ్ డిస్పాచ్ కేంద్రం ఆదేశాల మేరకు పొల్లూరు జల విద్యుత్‌కేంద్రంలోని జెన్‌కో ఉన్నతాధికారులు రెండు యూనిట్లు ద్వారా విద్యుదుత్పత్తి ప్రారంభించారు. దీంతో ఒక్కసారిగా సీలేరు నది ప్రవాహం పెరగడంతో ఆరుగురు యువకులు రాళ్లపైకి చేరి రక్షించమని ఆర్తనాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న ఎస్ఐ ఎస్‌కే సాదిక్ తన సిబ్బందితో, ఎంపీటీసీ వేగి నాగేశ్వరరావు స్థానిక ఈతగాళ్లతో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. నీటిప్రవాహం ఎక్కువగా ఉండటంతో ఎస్ఐ సాదిక్.. ఏపీ జెన్‌కో ఉన్నతాధికారులకు ఫోన్ చేసి ప్రవాహంలో చిక్కుకున్న యువకుల గురించి తెలియజేసి, జల విద్యుదుత్పత్తిని కొంత సమయం ఆపమని కోరగా, వారు విజయవాడ విద్యుత్ సౌధ అధికారులకు తెలియజేసి గంటపాటు విద్యుదుత్పత్తి నిలిపివేశారు. దీంతో పెద్దా తాళ్లతో ఆరుగురు యువకులను సురక్షితంగా ఒడ్డుకు తీసుకువచ్చారు. వారు ఎస్ఐ, ఎంపీటీసీ బృందాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పర్యాటకులు ఎవరూ సీలేరు నదిలో స్నానాలకు దిగరాదన్నారు.

టీడీపీ, జనసేన పోటాపోటీ నినాదాలు

పిఠాపురంలో స్వల్పతోపులాట, ఉద్రిక్తత



పిఠాపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవంలో టీడీపీ, జనసేన పోటాపోటీ నినాదాలు, స్వల్పతోపులాటలతో ఉద్రిక్తతలు ఏర్పడ్డాయి. ఆదివారం సాయంత్రం ఏఎంసీ పాలకవర్గ ప్రమాణ స్వీకారోత్సవం జరిగింది. ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా చేరుకున్నారు. వీరు పోటాపోటీగా నినాదాలు చేసుకున్నారు. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ముందుగానే స్టేజీ పైకి చేరుకోగా, మంత్రి నాదెండ్ల మనోహర్, ఇతర జనసేన నేతలు చేరుకుంటున్న సమయంలో ఈ నినాదాలు మరింత హోరెత్తాయి. ఒకానొక సమయంలో రెండు పార్టీల కార్యకర్తలు, నాయకులు పరస్పరం తోసుకున్నారు. అందరు సంయనం పాటించాలంటూ మంత్రి నాదెండ్ల ఒక సమయంలో చేతులు జోడించి వేడుకున్నారు. నాయకుల ప్రసంగాల సమయంలో మరింతగా నినాదాలతో హోరెత్తించారు. ఈ పరిస్థితి కూటమి నాయకులకు ఇబ్బందికరంగా మారింది. నినాదాల హోరు, తోపులాట జరిగిన నేపథ్యంలో ఉన్నతాధికారులు అప్రమత్తమై భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. టీడీపీ, జనసేనల మధ్య మరోమారు విభేదాలు బయటపడడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

3 లక్షల ఎకరాలకు సాగునీరు

- తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సునీల్‌కుమార్
- కాలువలకు నీరు విడుదల
- గోదావరి మాతకు పూజలు





ధవళేశ్వరం వద్ద కాలువలకు విడుదలవుతున్న సాగునీరు, స్విచ్ ఆన్‌చేసి గేట్లను ఎత్తుతున్న ప్రాజెక్టు కమిటీ చైర్మన్

ధవళేశ్వరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్‌లో తూర్పు డెల్టాలో 3లక్షల ఎకరాలకు సాగునీటిని సక్రమంగా అందించనున్నామని తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ సునీల్‌కుమార్ అన్నారు. రబీ సీజన్ అనంతరం మూసివేసిన డెల్టా కాలువలకు ఆదివారం ఉదయం సాగునీటిని విడుదల చేశారు. ధవళేశ్వరంలోని తూర్పుడెల్టా హెడ్ స్లూయిస్ వద్ద సర్కిల్ ఇన్‌చార్జి ఎస్ఈ బత్తుల వెంకటస్వామి, తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ మురాలశెట్టి సునీల్‌కుమార్, ఈఈ వీవీ రామకృష్ణ గోదావరి మాతకు పూజలు నిర్వహించి చీర, జాకెట్, పసుపు, కుంకుమ, పూలు, పండ్లను గోదావరి మాతకు సమర్పించారు. అనంతరం గేట్లకు స్విచ్ ఆన్‌చేసి హెడ్ స్లూయిస్‌లోని నాలుగు గేట్ల ద్వారా కాలువలకు నీటిని విడుదల చేశారు. ఈఈ మాట్లాడుతూ పంట తుఫాన్‌ల బారిన పడకుండా ఉండడానికి జూన్ 1వ తేదీనే కాలువలకు సాగునీటిని విడుదల చేస్తున్నామని, రైతులు సకాలంలో పంట సాగు చేసి తుఫానుల బారిన పడకుండా కాపాడుకోవాలన్నారు. తూర్పుడెల్టా పరిధిలో రూ.6.10 కోట్లతో 159 పనులు చేపట్టామని, పనులన్నీ వివిధ దశల్లో ఉన్నాయని త్వరగా పూర్తి చేస్తామని తెలిపారు. అంతకుముందు ఇన్‌చార్జి ఎస్ఈ బత్తుల వెంకటస్వామి, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్.. బొబ్బర్లంకలోని సెంట్రల్ డెల్టా హెడ్ స్లూయిజ్ వద్ద గోదావరమ్మకు పూజలు చేసి సాగునీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో తూర్పుడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ తమలంపూడి సుధాకర్ రెడ్డి, మండపేట డీసీ పీవీ సుబ్బారెడ్డి, డీఈలు ఆనంద్‌బాబు, రమేష్, ఆనంద్‌కుమార్, ఏఈలు రాధాకృష్ణ, అద్దంకి సాయిరాం, ఇరిగేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ డెల్టా కాలువలకు..

నిడదవోలు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): నిడదవోలు మండలం విజ్జేశ్వరం వద్ద ఉన్న హెడ్ స్లూయిజ్‌కు ఆదివారం గోదావరి హెడ్ వర్క్స్ ఇన్‌చార్జి ఎస్ఈ వెంకటస్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదావరి మాతకు పువ్వులు, చీర, రవిక, పండ్లు సమర్పించి హారతులిచ్చి హెడ్ స్లూయిజ్ స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ముందుగా 200 క్యూసెక్కుల నీటిని విడుదల చేసి అనంతరం సాయంత్రానికి మరో 300 క్యూసెక్కులకు పెంచి 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అనంతరం ప్రాజెక్ట్ కమిటి చైర్మన్ కృష్ణంరాజు మాట్లాడుతూ రైతాంగానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంటలకు నీరందిస్తామన్నారు. ఇప్పటికే కాలువలకు సంబంధించి పూడికతీత పనులు పూర్తయ్యాయన్నారు. కార్యక్రమంలో నీటి పారుదల శాఖ ఈఈ సుబ్రహ్మణ్యేశ్వరరావు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పోలీస్ కానిస్టేబుల్స్ రాత పరీక్ష


సూరంపాలెం ఆదిత్య కళాశాలలో పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బిందుమాధవ్

కాకినాడ క్రైం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లావ్యాప్తంగా ఆదివారం నిర్వహించిన పోలీస్ కానిస్టేబుల్స్ మెయిన్స్ రాత పరీక్ష ప్రశాంతంగా జరిగింది. కాకినాడలో ఐడియల్ కాలేజ్ ఆఫ్ టెక్నాలజీ, మోహన్ కాలేజ్, గవర్నమెంట్ ఐటీఐ, వీఎస్ లక్ష్మి డిగ్రీ కళాశాల, గండేపల్లి మండలం సూరంపాలెం ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలల్లో ఉదయం 10గంటలకు ప్రారంభమైన పరీక్ష మధ్యాహ్నం 1గంటకు ముగిసింది. మొత్తం 12 సెంటర్లలో 6,302 మంది అభ్యర్థులకు 6,021 మంది హాజరైనట్టు జేఎన్టీయూ ప్రొఫెసర్, పరీక్షల కన్వీనర్ సాయిబాబా వెల్లడించారు. తొలుత అన్ని పరీక్షా కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ బిందుమాధవ్ పర్యవేక్షించారు.పూర్తి పారదర్శకతతో నిర్వహించామని ఆయన చెప్పారు.

చిరంజీవినీ కుమారి మృతికి కవి సంధ్య సంతాపం

యానాం/కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడకు చెందిన ప్రముఖ విద్యావేత్త, తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం అధ్యక్షురాలు, ఐడియల్ కళాశాలల కరస్పాండెంట్, అభ్యుదయ రచయిత్రి డాక్టర్ పి.చిరంజీవినీకుమారి మృతికి 'కవి సంధ్య' సంపాదకుడు డాక్టర్ శిఖామణి సంతాపం తెలిపారు. తాను పీఆర్ కాలేజీలో డిగ్రీ చదివే రోజుల నుంచి కవిసంధ్య పత్రిక వరకు ఆమె అందించిన ప్రోత్సాహం మరువలేనిదన్నారు. గత ఏడాది కథా సదస్సు నిర్వహించారన్నారు.మేలో యానాంలో కవి సంధ్య ఆధ్వర్యంలో నిర్వహించిన దాట్ల అభినందన సభలో ఆమె ఉత్సాహంగా పాల్గొన్నారని గుర్తుచేశారు.

అన్నవరం దేవస్థానంలో ఇద్దరు ఉద్యోగుల తాత్కాలిక తొలగింపు

అన్నవరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అన్నవరం సత్యనారాయణ స్వామి దేవస్థానం సీఆర్వో విభాగంలో పనిచేస్తోన్న కాంట్రాక్ట్ ఉద్యోగులు అల్లు కలికేశ్వరరావు, బండారు శ్రీనివాస్‌లను తాత్కాలికంగా తొలగిస్తూ ఈవో వీర్ల సుబ్బారావు ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. శనివారం రాత్రి దేవస్థానంలో గదులు ఖాళీగా ఉన్నా భక్తులకు కేటాయించని విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లడంతో ఈవో ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. గదులు ఖాళీగా ఉన్నా ఎందుకు కేటాయించలేదని వారిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అనంతరం కాంట్రాక్ట్ ఉద్యోగులు కలికేశ్వరరావు, శ్రీనివాస్‌లను తాత్కాలికంగా తొలగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. గదులను భక్తులకు కేటాయించకుండా ఖాళీగా ఉంచితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సత్యదేవుడికి 12 గ్రాముల బంగారం..

సత్యదేవుడికి ఆదివారం ఒకదాత 12గ్రాముల బంగారు ముద్దను విరాళంగా సమర్పించారు. ఆముదాలవలసకు చెందిన బస్వా కాశీబాబు సోదరులు వీటిని ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేయగా దాతను వారు అభినందించి స్వామివారి ప్రత్యేక దర్శనం, ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్వో కృష్ణారావు, సూపరింటెండెంట్‌లు అనకాపల్లి ప్రసాద్, యనమల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం
• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి

23 మందికి రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్


అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్1(ఆంధ్రజ్యోతి): వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలందిస్తున్న 23 మందికి రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డ్స్ 2024-25ను అందజేశారు. శనివారం సాయంత్రం స్థానిక జేఎన్ రోడ్డులోని ఏకేసీ రోటరీ హాల్లో రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి రోటరీ అధ్యక్షుడు నాళం నరసింహారావు, లెఫ్టినెంట్ జాస్తి మూర్తి, బూర్లగడ్డ సుబ్బారాయుడు, ఒకేషనల్ సర్వీసెస్ డైరెక్టర్ ఏలేటి రవిబాబు, అసిస్టెంట్ గవర్నర్ దొరబాబు, కార్యదర్శి చంద్రశేఖర్ విచ్చేసి అవార్డ్సును అందజేశారు. జాస్తి మూర్తి పురస్కార గ్రహీతల సేవలను కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా 120ఏళ్ల నుంచి రోటరీ అందిస్తున్న సేవలను సుబ్బారాయుడు వివరించారు. కార్యక్రమంలో చార్టెడ్ అకౌంటెంట్ విభాస్కరరామ్,న్యాయవాది మద్దూరి సుబ్బారావు, బెరూలాలల్ జైన్, డాక్టర్ వీకే రాజు, కేటీ కృష్ణారావు, నాళం రాహుల్, నాగేందర్ కిషోర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

కడియం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం.. దుళ్ల గ్రామానికి చెందిన కాలెపు వెంకటేశ్వరరావు (43) రైసుమిల్లు గుమస్తాగా పనిచేస్తుంటాడు. చొప్పెల్లలో జరుగుతున్న అమ్మవారి జాతర చూసేందుకు ఈనెల 31న మోటారుసైకిల్‌పై బయలుదేరాడు. దుళ్ల-చొప్పెల్ల రోడ్డులో దుళ్ల శివారులోకి వెళ్లేసరికి ఎదురుగా వస్తున్న మోటారుసైకిల్ ఢీకొట్టింది. ఈ ఘటనలో గాయాలపాలైన వెంకటేశ్వరరావును 108 అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. కాగా వెంకటేశ్వరరావుకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే మరో మోటారుసైకిల్‌పై వచ్చి ఢీకొట్టిన వ్యక్తి కూడా గాయాలపాలవ్వడంతో అతడిని కూడా ఆస్పత్రికి తరలించినట్టు స్థానికులు తెలిపారు.

అలరించిన 'జయహో ఛత్రపతి శివాజీ'



నాటక ప్రదర్శనను తిలకిస్తున్న ప్రముఖులు, మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

రాజమహేంద్రవరం కల్చరల్ జూన్1(ఆంధ్రజ్యోతి): భారత దేశ చరిత్ర పుటల్లో నిజమైన దేశ భక్తుడిగా..వీరుడిగా శివాజీ నిలిచిపోయారని.. అటువంటి మహనీయుడి జీవిత చరిత్రను నాటకంగా రూపొందించి సుమారు 200 మంది కళాకారులతో ప్రదర్శన నిర్వహించడం దేశానికే ఎంతో గర్వకారణమని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. డాక్టర్ రామన్ ఫౌండేషన్ సీబీఆర్ స్పోర్ట్స్ అకాడమి, సంస్కార భారతి సంయుక్త ఆధ్వర్యంలో హిందూ చైతన్య వేదిక పర్యవేక్షణలో ఆదివారం సాయంత్రం ఆనం కళాకేంద్రంలో జయహో ఛత్రపతి శివాజీ నాటకం ప్రదర్శించారు. నాటక ప్రదర్శన అలరించిందని ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. ఈ కార్యక్రమంలో చలసాని బలరామయ్య, పీవీఎస్ కృష్ణ, గిరిజాల సోమరాజునాయుడు,వేదాంతం రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వేతన బకాయిలు చెల్లించాలి

» రెండు నెలలుగా చెల్లించని కోరుకొండ పంచాయతీ
» సరైన ఆదాయం లేక సకాలంలో జీతాలు ఇవ్వలేకపోతున్నాం : పాలక వర్గం

కోరుకొండ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కోరుకొండ గ్రామ పంచాయతీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు సక్రమంగా జీతాలు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రతినిత్యం 14 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారు. పంచాయతీకి సరైన ఆదాయం లేకపోవడంతో పారిశుధ్య కార్మికులకు సకాలంలో జీతాలు ఇవ్వలేకపోతున్నామని పంచాయతీ పాలక వర్గం తెలిపింది. పారిశుధ్య కార్మికులకు రెండు నెలల జీతాలు ఇవ్వాల్సి ఉందన్నారు. ఈ విషయంపై సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజ మాట్లాడుతూ తమ పంచాయతీకి ఆదాయం అంతంత మాత్రంగానే ఉందన్నారు. ప్రభుత్వ సహకారం అందకపోవడంతో ఆర్థిక లోటు ఏర్పడిందన్నారు. ఇంటి పన్ను వసూళ్లలో ఆటంకం ఏర్పడిందన్నారు. కోరుకొండలోని భూములు లక్ష్మీనరసింహస్వామి దేవస్థానానికి చెందినవి కావడంతో అధికారులు చొరవ చూపడం లేదన్నారు. ఇంటి పన్నులు, కుళాయి పన్నులు సమాజ హితం కోరే వారి తప్ప అందరి నుంచి వసూలు చేయడం లేదన్నారు. చాలా మంది పంచాయతీ అనుమతులు పొందకుండానే భవన నిర్మాణ సముదాయాలను నిర్మిస్తున్నారని తెలిపారు. పంచాయతీకి సక్రమంగా సకాలంలో పనులు చెల్లిస్తే ఆదాయ సమస్య పరిష్కారం అవుతుందని లక్ష్మీసరోజ అన్నారు.

చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం కల్చరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ది రాజమండ్రి ఐరన్ అండ్ హార్డ్‌వేర్ పెయింటర్స్ అసోసియేషన్ హాల్‌లో పోటీలు నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 70 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. వారిలో వి.సుజన్‌కుమార్, సీహెచ్ సూర్య గీతేష్, కె.శ్రీఇషాంత్, వి.భువన్ సాయి జస్వంత్ విజేతలుగా నిలిచారు. ఈ నలుగురు విజయవాడలో ఈ నెల 7, 8 తేదీల్లో జరుగబోయే రాష్ట్ర మెన్ ఓపెన్ చదరంగం పోటీలకు, మన జిల్లా తరపున ప్రాతినిధ్యం వహిస్తారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా కమిటీ సభ్యులు వైకళ్యాణ్ కుమార్,జివికుమార్,జివిఎస్‌లక్ష్మి,వరదా సురేష్‌లు వ్యవహరించారు.


పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు

అనపర్తిలో పూర్వ విద్యార్థుల కలయిక


అనపర్తి బాలికోన్నత పాఠశాల 2006-07 బ్యాచ్ పదో తరగతి విద్యార్థినులు

అనపర్తి, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అనపర్తిలోని ద్వారంపూడి బుల్లెమ్మాయి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో 2006-07 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న విద్యార్థినులు ఆదివారం పాఠశాలలో కలుసుకుని సందడి చేశారు. తాము విద్యనభ్యసించిన తరగతి గదుల్లో 18 ఏళ్ల తరువాత కూర్చుని నాటి అనుభూతులను, అల్లరి చేష్టలను నెమరవేసుకున్నారు. ప్రస్తుతం ఎవరెవరు ఏమి చేస్తున్నారో వివరాలను తెలుసుకుంటూ రోజంతా ఉత్సాహంగా గడిపారు. ఈ కలయికకు కృషి చేసిన నల్లమిల్లి సునీతను స్నేహితులు అభినందించారు. కార్యక్రమంలో నల్లమిల్లి భార్గవి, లావణ్య, శ్రీ మాధురి, శిరీష, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎస్ పేటలో హైవోల్టేజీ

» కాలిపోతున్న విద్యుత్ ఉపకరణాలు
» పట్టించుకోని అధికారులు


హైవోల్టేజీకి కాలిపోయిన స్టెబిలైజర్

బిక్కవోలు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ఆర్ఎస్.పేట గ్రామంలో 20 రోజులుగా విద్యుత్ హైఓల్టేజి వస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కూటమి నేతలు బోను సూర్యకుమార్, మాడా మోహన్ ఆదివారం ఆరోపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్లకు 260కు పైగా ఓల్టేజి వస్తుండడంతో ఇంట్లోని ఫ్రిజ్‌లు, స్టెబిలైజర్‌లు, ఇన్వెర్టర్లు కాలిపోతున్నాయని, స్థానిక విద్యుత్ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదన్నారు. ఈవిషయమై విద్యుత్ ఏఈ కె.బుజ్జిదొరను వివరణ కోరగా వెంటనే సరిచేస్తామని చెప్పారు.

సమర్థవంతంగా పంపిణీ చేయాలి

» ఆర్డీవో కృష్ణనాయక్
» పలుచోట్ల డిపోల ద్వారా రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభం


కడియంలో రేషన్‌షాపును ప్రారంభిస్తున్న ఆర్డీవో కృష్ణనాయక్

కడియం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల మేరకు ప్రజలకు ఈ ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యావసరాలైన బియ్యం తదితర సరుకులను సమర్థవంతంగా పంపిణీ చేయాలని ఆర్డీవో కృష్ణనాయక్ సూచించారు. సుమారు ఐదేళ్ల క్రితం నిలిచిపోయిన రేషన్ డీలర్ వ్యవస్థను ప్రభుత్వం పునరుద్ధరించింది. దీంతో రేషన్ షాపులు మళ్లీ తెరుచుకున్నాయి. కడియంలో రేషన్ దుకాణాన్ని ఆర్డీవో ప్రారంభించారు. ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు షాపుల వద్ద డీలర్లు లబ్ధిదారులకు సరుకులు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, నాయకులు వెలుగుబంటి రఘురామ్(నాని), బొర్సు బ్రహ్మణ్యం, తహశీల్దారు సునీల్ కుమార్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు. కడియపులంకలో తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్గాని సత్యనారాయణ, తహశీల్దారు ఎంఎస్‌వో ప్రభాకర్‌తో కలిసి రేషన్‌షాపును ప్రారంభించారు. వీరవరంలో సర్పంచ్ బత్తుల నళినిజయంతిరాము, ఆదిమూలం సాయిబాబా, దొం తంశెట్టి భద్రయ్య. వేమగిరిలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి చెల్లుబోయిన శ్రీను రేషన్‌షాపులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో పాటంశెట్టి రాంజీ, పంతం గణపతి, దొంతంశెట్టి శ్రీను, గోరు నాగేశ్వరరావు, జోగి చక్రవర్తి, పితాని గోవిందు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: మండలంలో షాపుల ద్వారా రేషన్ పంపిణీని కూటమి నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మండలంలో 40 రేషన్ షాపులు వున్నాయని, వీటి ద్వారా ప్రస్తుతం బియ్యం, పంచదార పంపిణీ చేస్తున్నామని తహశీల్దార్ సత్యకృష్ణ తెలిపారు. బిక్కవోలులో పాలచర్ల చిట్టిబాబుచౌదరి, చాగంటి సాయిబాబారెడ్డి, గుణ్ణం రమేష్‌చౌదరి, బేరా వేణమ్మ, వడ్లమూరి లక్ష్మి రేషన్ పంపిణీ చేశారు. తొస్సిపూడిలో ఎంపీపీ తేతలి సుమ, ఇల్లపల్లిలో తనుకు శ్రీధర్, రంగాపురంలో నడింపల్లి చిరంజీవిరాజు, కానేటి అప్పలస్వామి, చెల్లే జోష్‌బాబు, ఊలపల్లిలో తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి, ఆరికరేవులలో రెడ్డి శ్రీను,ఇందల వీరబాబు, బలభద్రపురంలో సర్పంచ్ బుంగా రామారావు, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, పందలపాకలో పడాల సూర్యనారాయణరెడ్డి, కొమరిపాలెంలో పడాల రాము, డీవీఆర్‌ల ఆధ్వర్యంలో రేషన్ షాపుల ద్వారా సరకుల పంపిణీని ప్రారంభించారు.

ధవళేశ్వరం: అందంగా తీర్చిదిద్దిన రేషన్ షాపుల వద్ద కూటమి నాయకులు లబ్ధిదారులకు బియ్యం, కందిపప్పు, పంచదార అందజేశారు. ఎర్రకొండపై ఉన్న 22, 51 రేషన్ డిపోలను తహశీల్దార్ బి.శ్రీనివాసరావు సందర్శించి పంపిణీని ప్రారంభించారు. అనంతరం ఇతర రేషన్ డిపోల వద్ద కూటమి నాయకులు రేషన్ పంపిణీని ప్రారంభించారు.

సీతానగరం: మండలంలోని బొబ్బిల్లంక గ్రామంలోని నెం.28 షాప్‌లో రేషన్ పంపిణీని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ప్రారంభించారు. అలాగే వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులను అందజేశారు. ప్రతి కుటుంబానికి రేషన్ సరుకులు అందించడమే లక్ష్యంగా షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎ.శ్రీనివాస్, పోలిన కృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేటలో రేషన్‌షాపును తహశీల్దార్ కోసు అనసూయ ప్రారంభించి మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా జరిగేలా చర్యలు తీసుకున్నామని, ప్రతి ఒక్కరికి సమయానికి సరుకులు అందేలా షెడ్యూల్ ప్రకారం పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, కూటమి నాయకులు మండవిల్లి గుప్త, ఉండవిల్లి గిరిబాబు, వి.మాణిక్యం, గారపాటి రాంబాబు, పోతుల చిన్నాకాపు, పి.వీరసుందర్రావు, దూబాసి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: మండలంలోని 11 గ్రామాల్లో 39 రేషన్ షాపులు పండగ వాతావరణంలో తెరుచుకున్నాయి. సుందరంగా తీర్చిదిద్దిన రేషన్ షాపులను ఆయా గ్రామాల్లో కూటమి నాయకులు ప్రారంభించి లబ్ధిదారులకు రేషన్ సరుకులు అందజేశారు.


పాలచర్లలో వృద్ధురాలికి రేషన్ అందజేస్తున్న ఎమ్మెల్యే బత్తుల

ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల ప్రజలు ఇబ్బందులకు గురి కావడమే కాకుండా కోట్లాది రూపాయలు ప్రజాధనం వృథా అయిందన్నారు. 15 రోజుల పాటు రోజుకు రెండు పూటలా సరుకులు పంపిణీ చేసే విధానం ద్వారా ప్రజలకు పూర్తి స్థాయిలో రేషన్ అందుతుందన్నారు. అనపర్తిలో దత్తుడు శ్రీను, పొలమూరులో సత్తి దేవదానరెడ్డి, రామవరంలో తేనెల శ్రీనివాస్, గోపాలకృష్ణారెడ్డి,కుతుకులూరులో సర్పంచ్ గొల్లు హేమతులసి, పెడపర్తి శ్రీనివాసరెడ్డి, పులగుర్తలో లాలయ్య, జాస్తి రాంబాబు పాల్గొనగా తహసీల్దార్ అనిల్‌కుమార్ పర్యవేక్షించారు.

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెంలో రేషన్ పంపిణీ కార్యక్రమాన్ని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో రేషన్ పంపిణీలో జరిగిన అవకతవకలను అరికట్టేందుకే ఎండీయూ వాహనాలను కూటమి ప్రభుత్వం రద్దు చేసిందన్నారు. నెలలో 15 రోజుల పాటు రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంటాయని, దీని ద్వారా పేదలకు తగిన వెసులుబాటు కలుగుతుందన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు సాయిప్రసాద్, నాయకులు కన్నబాబు, అడపా భరత్, మంగరౌతు రాము, పాలూరి బోస్, గాజింగం సత్తిబాబు, దాసరి తమ్మన్నదొర, దాసరి సతీష్, బదిరెడ్డి బాబి, రాము పాల్గొన్నారు.


కృష్ణునిపాలెంలో రేషన్ పంపిణీని ప్రారంభించిన ఎమ్మెల్యే జ్యోతుల

రూ.1,600 కోట్లు దుర్వినియోగం: ఎమ్మెల్యే బత్తుల

దివాన్‌చెరువు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): దాదాపు రూ.1,600 కోట్లు ప్రభుత్వ, ప్రజాధనం దుర్వినియోగం చేయడమేకాకుండా లబ్ధిదారులెవరికీ సక్రమంగా సరుకులు అందకుండా పోయిన పరిస్థితి గతంలో చూశామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. పాలచర్లలో రేషన్‌డిపోల ద్వారా సరుకుల పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. అలాగే 65 ఏళ్లు దాటిన వృద్ధురాలికి ఇంటి వద్దకు సరుకులు తీసుకువెళ్లి ఎమ్మెల్యే అందజేశారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎండీయూ వ్యాన్‌ల ద్వారా ఇంటి వద్దకే నిత్యావసరాల పంపిణీ పేరుతో గత వైసీపీ ప్రభుత్వంలో పెద్ద స్కాంకు తెరదీసారని ఎమ్మెల్యే ఆరోపించారు. కాగా నెలలో 15 రోజులపాటు ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8గంటల వరకూ రేషన్ సరుకులు తీసుకోవచ్చునని చెప్పారు. అలాగే దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దనే సరుకులు అందజేస్తారన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జీఎస్ఎల్ దేవి, ఎంపీడీవో జేఏ ఝాన్సీ ఎంఎస్‌వో జి.బాపిరాజు, కూటమి నాయకులు దేశాల శ్రీను, వంక మల్లిబాబు, తోట రామకృష్ణ, కిమిడి శ్రీరాం, ఎర్రంశెట్టి శ్రీను, వేగిశెట్టి రాజు, అక్కిరెడ్డి వేణు పాల్గొన్నారు.

రేషన్ డిపో అందుబాటులో ఉంచండి

దివాన్‌చెరువులో ప్రస్తుతం మంజూరు చేసే కొత్తరేషన్ డిపోని పాతూరు ప్రజలకు అందుబాటులో ఉండే ప్రదేశంలో ఏర్పాటుచేయాలని దివాన్‌చెరువుకు చెందిన ఎలుబండి దుర్గారావు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణకు విజ్ఞప్తిచేసపారు. పాలచర్లలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బత్తులకు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. పాలచర్ల రోడ్‌లో ప్రస్తుతం రెండు షాపులు ఉన్నాయని, కొత్త షాపును పాతూరు ప్రజలకు అందుబాటులో ఉండేలా ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే.. ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఈ రేషన్ డిపో ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని తహశీల్దార్‌కు సూచించారు.

కోరుకొండలో అంకాలమ్మ జాతర

కోరుకొండ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కోరుకొండ గ్రామదేవత అంకాలమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. 3 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. జాతర ప్రారంభం సందర్భంగా అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం గ్రామంలో అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. మంగళవారం నైవేద్యాలు సమర్పిస్తారు.

సహజ వనరులపై ఆంధ్రాకు వాటా దక్కాలి

» సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు



సమావేశంలో మాట్లాడుతున్న ముప్పాళ్ల నాగేశ్వరరావు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కృష్ణా, గోదావరి బేసిన్‌లో లభ్యమవుతున్న గ్యాస్, చమురు వంటి సహజ వనరులపై ఆంధ్ర రాష్ట్రానికి వాటా దక్కాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు జులైలో రాజమహేంద్రవరంలో రాష్ట్ర సదస్సు నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రపంచంలో అతిపెద్ద చమురు శాతం ఆంధ్రప్రదేశ్‌లో ఉందని, కేజీ బేసిన్లో ముంబాయి కంటే చమురు నిల్వలు ఎక్కువగా ఉన్నాయని, లక్షల కోట్ల విలువైన సహజ వనరులను కార్పొరేట్ సంస్థలు దోచుకుపోతున్నాయని ఆరోపించారు. విశాఖపట్నం ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని విశాఖలో కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తున్నా ఇప్పటి వరకూ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నోరు మెదపడంలేదని అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సీపీఐ పార్టీ అన్ని రాజకీయపార్టీలను కలుపుకుని పోరాటం నిర్వహిస్తున్నదని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు పాల్గొన్నారు.

దేశాన్ని కాపాడుకోవాలి..

కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ అవలంబిస్తున్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని, ఆర్ఎస్ఎస్ నుంచి దేశాన్ని కాపాడుకోవాలని ముప్పాళ్ల నాగేశ్వరరావు కోరారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని కొత్తపేట రాజాదిబ్బ సీపీఐ శాఖ సభలో ఆయన మాట్లాడారు. సేపేని రమణమ్మ అధ్యక్షతన జరిగిన సభలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో యువతలో ఆత్మవిశ్వాసం పెంపు

టెన్నిస్ టోర్నమెంట్ ముగింపులో ఏఎస్పీ చెంచిరెడ్డి, అనురాధ


టెన్నిస్ టోర్నమెంట్ విజేతలతో ముఖ్యఅతిథులు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): క్రీడలు యువతలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని జిల్లా అడిషనల్ ఎస్పీ(ఏఆర్) ఎల్.చెంచిరెడ్డి, కెంబ్రిడ్జ్ మాంటిస్సోరి స్కూల్ డైరెక్టర్ ఎం.అనురాధ, విశ్రాంత అడిషనల్ ఎస్పీ వాసంశెట్టి గోపాలకృష్ణ అన్నారు. వెనస్ టెన్నిస్ హట్ ఆధ్వర్యంలో రాజమండ్రి ఆఫీసర్స్ క్లబ్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి స్మార్ట్ లాన్ టెన్నిస్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమానికి వారు, రాజమహేంద్రవరం టెన్నిస్‌క్లబ్ అధ్యక్షుడు ఎన్.గణేష్ శ్యామ్‌సింగ్‌లతో కలిసి ముఖ్యఅతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. క్రీడలతో విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢత్వాన్ని సాధిస్తారన్నారు. టెన్నిస్‌లో స్థిరత్వ, శ్రమ, నైపుణ్యం అవసరమన్నారు.ఈ పోటీలను కోచ్ బి.సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు. వెనస్ గ్లోరీ టోర్నమెంట్ రిఫరీగా వ్యవహరించారు. ఈ పోటీల్లో అండర్-8 విభాగంలో విన్నర్‌గా ఈ.దర్శిక్, రన్నర్‌గా ఐ.ఇవాంజలిన్ నిలిచారు. అండర్-10లో విన్నర్‌గా ఎస్.శరేనా, రన్నర్‌గా ఈ.దర్శిక్ నిలిచారు. అండర్-12లో విన్నర్‌గా సీహెచ్ యు వన్, రన్నర్‌గా కె.జయవర్ధన్ నిలిచారు. అండర్- 14 బాలుర విభాగంలో విన్నర్‌గా కె.అఖిల్, రన్నర్‌గా జి.నిఖిలేష్, బాలికల విభాగంలో విన్నర్‌గా పి.లోచన, రన్నర్‌గా జి.ఏంజెల్ నిలిచారు. అండర్-16 బాలికల విభాగంలో విన్నర్‌గా వై.లాస్య, రన్నర్‌గా పి.లోచన నిలిచారు. విజేతలకు అతిథులు ట్రోఫీలు,మెడల్స్, సర్టిఫికెట్లు అందించారు.

దానవాయిపేటలో యోగా మాసోత్సవం


రాజమహేంద్రవరంలో కలెక్టర్ తదితరుల యోగాసనాలు

రాజమహేంద్రవరం సిటీ, జూన్ 1(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాజమహేంద్రవరంలోని దానవాయిపేట పార్కులో యోగా గురువు సూరపురెడ్డి తాతారావు ఆధ్వర్యంలో యోగా మాసోత్సవం నిర్వహిస్తున్నారు. ఆదివారం దానవాయిపేట గాంధీ పార్కులో ఉదయం 5గంటల నుంచి 7గంట వరకు యోగిక్ జాగింగ్, సూర్యనమస్కారాలు, బస్త్రీక ప్రాణాయామం, మెడతో చేసే ప్రక్రియలు, మండుకాసనం, శశింకాసనం, ఉష్ట్రాసనం, సుప్త వజ్రాసనం, కూర్చుని చేసే సూక్ష్మ వ్యాయామాలు, కపాలబాతి, వక్రాసనం, ధ్యానం, చప్పట్లు, లాఫింగ్, అమృతావనం తదితర క్రియలు నిర్వహించి యోగా మిత్రులందరితో చేయించారు. కార్యక్రమంలో యోగా మిత్రులు గీసాల బాబ్జి, గోపి, బొల్లా సత్తిబాబు, సనపతి సత్తిబాబు, రామానాయుడు, తలారి పాపారావు, ఆలీ, మోహిద్దిన్, సంతోష్, రొక్కం అప్పారావు, పామర్తి గోపాలరావు పాల్గొన్నారు.

ధవళేశ్వరం: యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంటామని పంచాయతీ కార్యదర్శి జి.వెంకట్రావు అన్నారు. యోగాంధ్ర క్యాంపైన్‌లో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం పంచాయతీ కార్యాలయం వద్ద కార్యాలయ సిబ్బందితో పాటు విద్యార్థులు యోగాసనాలు వేశారు.


ధవళేశ్వరంలో యోగా చేస్తున్న దృశ్యం

నేడు యథావిధిగా పీజీఆర్ఎస్ : కలెక్టర్

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) ఈనెల 2న యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో పీజీఆర్ఎస్ ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుందని ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా నేరుగా అర్జీదాఖలు చేసే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమ అర్జీలను ఇవ్వడం కోసం 1100 మీకోసం కాల్ సెంటర్‌కు ఫోను ద్వారా తెలియజేసి ఫిర్యాదు నమోదు చేసే అవకాశం ఉందన్నారు. అదేవిధంగా గతంలో చేసిన ఫిర్యాదు పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. అర్జీల పరిష్కారం కోసం meekosam.ap.go v.in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకునే వెసులుబాటు కల్పించినట్టు కలెక్టర్ చెప్పారు.

జాతీయ స్థాయి క్రీడాకారులుగా రాణించాలి

నా సేన కోసం నా వంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి
ముగిసిన క్రికెట్ టోర్నమెంట్

రాజానగరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): గ్రామీణ క్రీడా కారులు జాతీయ స్థాయిలో రాణించాలని జనసేన పార్టీ నాసేన కోసం, నావంతు కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి ఆకాంక్షించారు. రాజానగరంలో మూడు వారాలుగా హోరాహోరీగా జరిగిన నాని వీరబాబు మెమోరియల్ టోర్నమెంట్ ఆదివారంతో ముగిసింది. ఈ పోటీల్లో నియోజకవర్గ వ్యాప్తంగా 31 టీమ్‌లు పాల్గొని తమ సత్తా చాటుకునేందుకు తలపడ్డాయి. తోకాడ-గాడాల టీమ్‌ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తోకాడ టీమ్ రన్నర్స్‌గానూ, గాడాల జట్టు విన్నర్స్‌గా నిలిచారు. ఈ సందర్భంగా విన్నర్స్ జట్టుకు ప్రథమ బహుమతిగా రూ.33,333, రన్నర్స్ జట్టుకు రూ.15,555 నగదు బహుమతు లను వెంకటలక్ష్మి అందజేశారు. అలాగే విన్నర్స్‌కు వడ్డి చిన్న, వడ్డి రాయుడు, రన్నర్స్ కప్పును సైతిన చెల్లారావు, సైతిన రాంబాబు రూ.5వేలు వంతున నగదుతో పాటు కప్పును బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మండల కన్వీనర్ వేగిశెట్టి రాజు, జనసైనికులు యర్రంశెట్టి శ్రీను, రాజానగరం గ్రామ కమిటీ అధ్యక్షులు సైతిన చెల్లారావు, గైట్ ప్రసాద్, సైతిన రాంబాబు, ఆచంట రాజా, సురేష్, సూరిబాబు, జయ, దుర్గమ్మ పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు

రాజమహేంద్రవరం అర్బన్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరానికి చెందిన వైద్యులు మహ్మద్ రియాజ్, పలువురు ముస్లింలు బీజేపీ పార్టీలో చేరారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని బీజేపీ పార్టీ జిల్లా కార్యాలయంలో 1వ మండల అధ్యక్షురాలు తుమ్మగుంట రమణమ్మ ఆధ్వర్యంలో ఈ చేరికలు జరిగాయి. వీరికి బీజేపీ ఎమ్మెల్సీ సోము వీర్రాజు పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, ఇతర బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా వెదుళ్లమ్మ జాతర

అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే బత్తుల, రుడా చైర్మన్ బీవీఆర్

సీతానగరం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): సీతానగరం మండలం వెదుళ్ళపల్లి గ్రామంలోని వెదుళ్ళమ్మ తల్లి జాతర మహోత్సవాన్ని ఆదివారం కమిటీ సభ్యులు గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ కేఎస్ జవహర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా వెదుళ్ళమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సహ పంక్తి భోజనాలు చేశారు.



ఐపీఎల్ షో అదిరే!

కాకినాడలో క్రికెట్ సందడి..

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో ఆదివారం క్రికెట్ అభిమానులతో సందడి నెలకొంది. క్రికెట్ ప్రేక్షకుల కోసం బీసీసీఐ దక్షిణ భారతదేశంలోనే తొలిసారిగా కాకినాడలో ఏర్పాటు చేసిన ఐపీఎల్ లైవ్ మ్యాచ్ వీక్షణకు పది వేల మంది క్రికెట్ అభిమానులు విచ్చేసినట్టు అంచనా. వర్షం కారణంగా మ్యాచ్ ఆలస్యం కావడంతో కొంతమంది నిరాశతో వెనుదిరిగారు. వర్షం తగ్గిన తర్వాత 9.45 గంటలకు పంజాబ్, ముంబాయి జట్ల మధ్య మ్యాచ్ ప్రారంభం కావడంతో అధిక సంఖ్యలో క్రికెట్ అభిమానులు తరలివచ్చి ఆనందంగా వీక్షించారు.రాజ్యసభ ఎంపీ, ఏసీఏ సెక్రటరీ సానా సతీష్‌బాబు పట్టుదలతో ఐపీఎల్ ఫైనల్ లైవ్ స్క్రీనింగ్ చూసే ఏకైక ఫ్యాన్ పార్క్ కాకినాడలో ఏర్పాటు చేశారు.లైవ్ మ్యాచ్ స్క్రీనింగ్,ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లు, డీజే సంగీతం, ఫుడ్‌కోర్ట్స్,కుటుంబ వినోదం ఉన్నాయి.కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, పంతం నానాజీ,ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మశ్రీ,కలెక్టర్ షణ్మోహన్ సగిలి, జేసీ రాహుల్ మీనా తదితరులు వచ్చారు.



సాహిత్య శిఖరం ఆమె.. విద్యాకుసుమం ఆమె..
అభ్యుదయ భావజాలమే ఆమె ఆభరణం..
తెలుగు భాషావృద్ధికి ఆమె కృషి అమోఘం..
సాగరతీరం కాకినాడలో ఎన్నో తరాలను
తీర్చిదిద్దిన సుజ్ఞాని ఆమె..
బతుకునిచ్చే పాఠాలు, జీవన వికాసానికి
పాటవాలు నేర్పిన ఉపాధ్యాయినిగా..
విద్య, సాహిత్య, సేవా రంగాలను
సమాజహితంగా ఏలిన మహారాణిగా..
సామాజిక దృక్పథమై అనేక వేదికలపై వినిపించిన సబలవాణి..
కాకినాడ ఐడియల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవినీ కుమారి..
ఆమె పరమపద సోపానం.. కాకినాడను దుఃఖసాగరంలో ముంచింది.
వయోభారంతో ఆమె వెడలినా.. ఆమె జీవన ప్రస్థానం..
వేనవేల మంది మదిలో.. కాకినాడ హృదిలో ఆమె 'చిరంజీవిని'..
అందుకే ఆమెను 'మదర్' ఆఫ్ కాకినాడ అనడంలో ఏ మాత్రం సందేహం లేదు..


చిరంజీవినీ కుమారి(ఫైల్)



కాకినాడ మదిలో చిరంజీవినే..

అస్తమించిన అభ్యుదయవాది చిరంజీవినీ కుమారి

94 ఏళ్ల వయసులో గుండెపోటుతో మృతి

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

అభ్యుదయవాది, సాహితీవేత్త, విద్యారంగానికి మార్గదర్శకురాలు, సామాజికవేత్త, కాకినాడలోని ఐడియల్ విద్యాసంస్థల కరస్పాండెంట్, కార్యదర్శి డాక్టర్ పి.చిరంజీవినీ కుమారి(94) ఆదివారం మధ్యాహ్నం గుండెపోటుతో ఇంటివద్ద తుదిశ్వాస విడిచారు. 1931 మార్చి 30న ఆమె జన్మించారు. చిరంజీవినీకుమారి భర్త పేరు పాలెపు శర్మ.. స్వాతంత్ర్య సమరయోధుడు..ఆయన కొన్నేళ్ల కిందట మరణించారు. వీళ్లకి ఇద్దరు కుమారులు.పెద్ద కుమారుడు పీబీఎస్ గోపాల్ వృత్తిరీత్యా వైద్యుడు విదేశాల్లో ఉంటున్నారు. చిన్నకుమారుడు పీఎస్ఎస్ కిరణ్.. కాకినాడలోనే ఉంటూ కుటుంబ వ్యాపారాలు చూసుకుంటున్నారు. బహుముఖ ప్రజ్ఞాశాలిగా చిరంజీవినీ కుమారి గుర్తింపు పొందారు. మానవ మనుగడకు మూలాలే ప్రధానం.వాటిని అసలు మరిచిపోకూడదనే ఆమె.. ఆస్తులను పంచి ఇచ్చినట్టుగానే వాటిని పిల్లలకు పంచి ఇవ్వాలని చెబుతూ ఉండేవారు. ఆమె మానవ విలువలపైనే వేదికలపై ప్రసంగించేవారు.మానవసంబంధాలు మృగ్యమైపోతున్నాయని వాటిని కాపాడాలని పదే పదే చెప్పేవారు. తూర్పుగోదావరి జిల్లా రచయితల సంఘం కార్యదర్శిగా జిల్లాలో భాషా సాహిత్యాభివృద్ధికి విశేష కృషి చేశారు. ఐడియల్ కళాశాలలో తెలుగు భాషను మాత్రమే ద్వితీయ భాషగా కొనసాగిస్తూ తెలుగు భాషా సంస్కృతి వికాసానికి ఎనలేని సేవలందించారు.మహాకవి శ్రీశ్రీ స్మృతి, వెయ్యేళ్ల తెలుగు సాహిత్య వేడుకలు, డాక్టర్ గరికిపాటి నరసింహారావు మొదటి సహస్రావధానం మొదలైన కార్యక్రమాలు ఐడియల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలోనే నిర్వహించారు. కాకినాడ రూరల్ మండలంలోని కొవ్వాడ గ్రామాన్ని దత్తత తీసుకుని అక్కడ యువతకు ఉపాధికి కృషి చేశారు. మహిళలు, పిల్లలు, తదితర యువతీయువకుల్లోని ప్రతిభాపాటవాలను వెలికితీయిస్తున్నారు.

1970లో కళాశాల పెట్టి..

కాకినాడ జిల్లా కాకినాడ రంగరాయ వైద్యకళాశాలలో ఆంగ్ల అధ్యాపకురాలిగా కొంతకాలం పనిచేసిన చిరంజీవినీ కుమారి డాక్టర్ పీవీఎన్ రాజుతో కలిసి 1970లో ఐడియల్ జూనియర్ కళాశాలను ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎంతో మంది ప్రముఖులు ఈ కళాశాలలో చదివిన వారే. నేడు డిగ్రీ, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఎంతో మంది


చిరంజీవినీ కుమారి భౌతికకాయం వద్ద నినాదాలు చేస్తున్న వామపక్ష నాయకులు

విద్యార్థులు చదువుకుంటున్నారు. ఆమె కాకినాడ అన్నవరం సత్యవతీదేవి మహిళా కళాశాల ఫౌండర్ మెంబర్‌గా, ఐడియల్ జూనియర్, డిగ్రీ కళాశాల, ఐడియల్ కాలేజీ ఆఫ్ ఆర్ట్స్ అండ్ సైన్సెస్‌కు ఫౌండర్ సెక్రటరీగా, ఐడియల్ గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్‌కు సెక్రటరీ అండ్ కరస్పాండెంట్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. ఫౌండర్ మెంబర్ ఆఫ్ ఏయూ పీజీ సెంటర్ కాకినాడ, ఏపీ స్టేట్ ప్రైవేట్ కాలేజీస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీగా, వేణుగోపాల సంస్కృత ప్రచార సభ కాకినాడ సెక్రటరీగా, తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంఘం సెక్రటరీగా, గిరిజన ప్రాంతంలోని 'స్పందన' స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్‌గా, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్‌గా, రాష్ట్ర అభ్యుదయ రచయితల సంఘం వైస్ ప్రెసిడెంట్‌గా, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ సభ్యురాలిగా, జనవిజ్ఞాన వేదిక స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యురాలిగా, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య సభ్యురాలిగా, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ సాధన సమితి వైస్ ప్రెసిడెంట్‌గా, జిల్లా అక్షరాస్యత సమితి 'అక్షర గోదావరి' సభ్యురాలిగా, జిల్లా విద్యాకమిటీ, జిల్లా టి.బీ. నియంత్రణ కమిటీ, జిల్లా అధికార భాషా సంఘం సభ్యురాలిగా ఎలా ఎన్నో పదవులను ఆమె చేపట్టారు. 2005లో న్యూఢిల్లీ వారు మదర్ ఇండియా జాతీయ అవార్డు అందజేశారు.హైదరాబాద్‌లో తుమ్మల వెంకట్రామయ్య సాహితీ సత్కారం, 2011లో శ్రీపొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం కీర్తిపురస్కారం, 2012లో షీ ఫౌండేషన్ హైదరాబాద్ వారు ఎక్సలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్,ఉమెన్ పురస్కారం అందజేశారు. 2014లో ఐ.పోలవరంలోని పుల్లెల తా తయ్య మెమోరియల్ అసోసియేషన్ వారు ఇంటిగ్రల్ హ్యూమనిస్ట్ అవార్డు అందజేశారు.

ఎన్నో రచనలు..

రచయితగా అనేక పుస్తకాలు రచించారు. 3-బుక్స్ ఆఫ్ తెలుగు పొయిట్రీ, బుక్ ఆఫ్ పోయమ్స్ ఆఫ్ 32 ఉమెన్ రైటర్స్ ఆఫ్ సోవియట్ ల్యాండ్ 'లేత మందారాలు.. రక్త సిందూరాలు',ఏ బుక్ ఆఫ్ స్టోరీస్ ట్రాన్స్‌లేటెడ్ ఫ్రమ్‌ఆర్మీనియన్ రైటర్స్ ఎస్పె షల్లీ తుమాన్యాన్..'ఆర్మీనియా కథలు- గాథలు '..'తూర్పు గోదావరి జిల్లా చరిత్ర- సం స్కృతి', గోదావరి కథలు-అలలు(తూర్పుగోదావరి జిల్లా కథల సంకలనం),ఎ రైటర్ ఆఫ్ అబౌట్ 80 ఎస్సేస్ ఇన్ ఏరియా ఆఫ్ లిటరేచర్, సోషల్ అండ్ ఉమెన్ ఏస్పెక్ట్స్, అబౌట్ 20 రేడియో టాక్స్ (మంచి వక్త, విమర్శకురాలు) ఉన్నాయి.

నేడు అంత్యక్రియలు

కాకినాడ ప్రతాప్‌నగర్‌లోని ఆమె నివాసం నుంచి సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు చిరంజీవినీ కుమారి భౌతికకాయాన్ని ఊరేగింపుగా ఇంద్రపాలెం లాకుల వద్ద గల ఐడియల్ కళాశాలకు తీసుకెళ్లనున్నారు. విద్యార్థులు, ప్రముఖుల సందర్శనార్థం ఆమె పార్థివదేహాన్ని అక్కడ ఉంచనున్నారు. అక్కడి నుంచి 3 గంటలకు శ్మశానానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కళాశాల గవర్నింగ్ బాడీ తెలిపింది.

ఎక్కడైనా రేషన్!

రేషన్ పంపిణీ ప్రారంభంలో మంత్రి నాదెండ్ల మనోహర్

- వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్
- ఉదయం 8 నుంచి పంపిణీ
- డీలర్ల అవకతవకలు సహించం
- ప్రజలు ఫిర్యాదు చేయవచ్చు
- డిపో వద్ద నెంబర్ల ఏర్పాటు
- బియ్యం స్మగ్లింగ్ చేస్తే పీడీ యాక్ట్
- 21 రోజుల్లో కొత్త కార్డులు



సర్పవరంలో వృద్ధుడి ఇంటికెళ్లి రేషన్ పంపిణీ చేస్తున్న మంత్రి నాదెండ్ల.. ఉండ్రాజవరంలో రేషన్ పంపిణీ చేస్తున్న మంత్రి కందుల దుర్గేష్

పిఠాపురం, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కార్డుదారులు తమకు నచ్చిన లేదా దగ్గరగా ఉన్న చౌక ధరల దుకాణం ద్వారా సరుకులు తీసుకునే అవకాశాన్ని కల్పించామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి నాదెండ్ల మనోహర్ హెచ్చరించారు. పిఠాపురం నూకాలమ్మ గుడి వీధి 18వ వార్డులో చౌక ధరల దుకాణం ద్వారా ఆదివారం రాష్ట్రవ్యాప్తంగా సరుకుల పంపిణీని ప్రారంభించారు.ఈ పోస్ యంత్రంపై కార్డుదారులు వేలిముద్ర వేసిన తర్వాత వారికి సరుకులను అందజేసి మాట్లాడారు. ప్రతి దుకాణానికి నిర్దేశించిన కోటా కంటే అదనంగా పదిశాతం సరుకులు పంపామని చెప్పారు. చౌక ధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరుకుల పంపిణీలో ఎక్కడ తప్పు జరిగినా తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. కార్డుదారులు ఫిర్యాదు చేసేందుకు వీలుగా అన్ని అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. ప్రతి చౌక ధరల దుకాణం వద్ద డీలరు పేరు, షాపు నెం బరు ఇతర వివరాలు ప్రదర్శించడంతో పాటు వాటిపైనే డీఎస్‌వో, తహశీల్దార్, ఇతర అధికారుల ఫోన్ నెంబర్లు అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఈ ఫోన్ల ద్వారా లేదా క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి సరుకుల పంపిణీలో ఫిర్యాదులు, సలహాలు, సూచనలు ఉండే తెలపవచ్చునని చెప్పారు. తూకం, సరుకుల నాణ్యత తదితర అంశాల్లో లోపాలు ఉన్నా, సమయానికి తెరవకున్నా ఫిర్యాదు చేస్తే తక్షణం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. వీటిని రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ నేతృత్వంలోని కేంద్ర కార్యాలయం నిరంతరం సమీక్షిస్తూ ఉం టుందని తెలిపారు. రేషన్ డిపోల ద్వారానే కార్డుదారులకు నిజాయితీగా సరుకులు అందు తాయని చెప్పారు. కాకినాడ పోర్టు ద్వారా జరిగే బియ్యం స్మగ్లింగ్ అరికట్టామని, అక్కడ చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని తెలిపారు. బియ్యం స్మగ్లింగ్‌పై పీడీ యాక్టు కింద కేసులు నమోదు చేస్తున్నామని చెప్పారు. రేషన్ షాపులు ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకూ ప్రతి రోజూ ఉదయం 8నుంచి 12 గంటల వరకూ, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకూ తెరిచి ఉంటాయని తెలిపారు. కాకినాడ జిల్లాలో 65 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు 71 వేల మంది ఉన్నారని గుర్తించామని, వీరికి ప్రతి నెలా 5వతేదీ లోగా సరుకులు అందించి ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. పింఛన్ల పంపిణీ మాదిరిగా గంటగంటకు, ప్రతి రోజూ సరుకుల పంపిణీ వివరాలు తెలిపేందుకు ప్రత్యేక యాప్ రూపొందించామన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తోందని చెప్పారు. కొత్తకార్డులు, సభ్యులు చేర్పు, తొలగింపు, చిరునామాల మార్పు తదితరాల కోసం చేసిన దరఖాస్తులను 21 రోజుల్లో పరిష్కరించి కొత్తకార్డులు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పం తం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యేలు ఎస్వీఎస్ఎన్ వర్మ, పెండెం దొరబాబు, జనసేన పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్,కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, జేసీ రాహుల్ మీనా,పాడా పీడీ చైత్రవర్షిణి, 18వ వార్డు కౌన్సిలరు పంపనబోయిన అన్నపూర్ణ పాల్గొన్నారు.



కోట సత్తెమ్మకు పూజలు

నిడదవోలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం కోటసత్తెమ్మ ఆలయంలో ఆదివారం అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు చేశారు. ప్రత్యేక అలంకరణలో ఉన్న అమ్మవారిని భక్తులు దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆదివారం భక్తులతో ఆలయం కళకళలా డింది.అమ్మవారికి రూ.1,88,977లు ఆదాయం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వహ ణాధికారి వి.హరి సూర్యప్రకాష్, చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు. అమ్మ వారికి ఆదివారం జంగారెడ్డిగూడెంనకు చెందిన కోసూరి దశరధరావు, నాగమణి దంపతులు,కుమారుడు కోసూరి రాజేష్ బాబు అరకేజీ వెండి అందజేశారు.

రేపు వికాస జాబ్ మేళా

రాజమహేంద్రవరం రూరల్, జూన్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం వికాస ఆధ్వర్యంలో ఐటీసీ లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్ కంపెనీలలో ఆపరేటర్ జాబ్స్‌కు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు వికాస పీడీ కే.లచ్చారావు తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ ఉద్యోగాలకు ఐటీఐ, ఇంటర్(ఒకేషనల్) ఉత్తీర్ణులై 30 సంవత్సరాల్లోపు వయసు గల పురుష ,మహిళ అభ్యర్థులు అర్హులన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 3న ఉదయం 9:30 గంటలకు విద్యార్హతల సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో నేరుగా హాజరుకావాలని తెలిపారు. వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.వికాస్ జాబ్స్.కం లేదా సెల్ 76608 23903ను సంప్రదించాలని కోరారు.



నేడో..రేపో

ఓపెన్ రీచ్‌లు నిలిపివేత?

(రాజమహేంద్రవరం - ఆంధ్రజ్యోతి)

వర్షాకాలం ఆరంభం కావడంతో ఉమ్మడి గోదావరి జిల్లా పరిధిలోని ఓపెన్ ఇసుక రీచ్‌లన్నీ మూసివేయనున్నారు. ఈ మేరకు రేపో మాపో అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది. మొత్తం 24 ఓపెన్ రీచ్‌లు మూత పడుతున్నట్టు సమాచారం. ఇక 18 డీసిల్టేషన్ పాయింట్ల ద్వారా మాత్రమే ఇసుక తీస్తారు. ప్రస్తుతం ఓపెన్ రీచ్‌లు, డీసిల్టేషన్ పాయింట్లలో కూడా ఇసుక అక్రమాలు జోరుగా సాగుతున్నాయి.అఖండ గోదావరిలో అక్రమ డెడ్జింగ్ సాగుతోంది.ఇక నైరుతీ రుతుపవనాలు ప్రవేశించడం,వర్షాలు రానుండడంతో గోదావరికి వరదలు వచ్చే అవకాశం ఉన్నందున రేపో మాపో అధికారికంగా ఓపెన్ రీచ్‌లు మూసివేసే అవకాశం ఉంది. జిల్లా,ఇతర ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేసిన 13 స్టాక్ పాయింట్ల ద్వారా ఇసుక విక్రయాలు జరుపుతారు. ఇప్పటికే అక్కడ ధరలు కూడా నిర్ణయించారు. కానీ వీటిని సోమవారం అధికారికంగా ప్రకటించనున్నారు.. వర్షాకాలంలో ఇసుక ఇబ్బంది లేకుండా స్టాక్ పాయింట్లలో నిల్వ చేశారు. వర్షాలు వచ్చినా డీసిల్టేషన్ తీసే అవకాశం ఉన్నందున అక్కడ పని కొనసాగుతోంది. బాగా వరదలు వస్తే ఆగిపోతుంది. స్టాక్ పాయింట్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. ఓవర్ లోడింగ్,అనధికార ఇసుక రవాణా మార్గాలపై పోలీసులు కఠిన నిఘా పెట్టాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. మరో పక్క గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 మే నుంచి 2024 మే వరకూ జిల్లాలో జరిగిన అక్రమ తవ్వకాలపై విచారణ మొదలైంది.

నేడు పీజీఆర్ఎస్

రాజమహేంద్రవరం రూరల్,జూన్ 1(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ ఈనెల 2న యథా విధిగా జరుగుతుందని కలెక్టర్ ప్రశాంతి తెలిపారు.ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో పీజీఆర్ఎస్ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరుగుతుందన్నారు. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా నేరుగా అర్జీదారులు ఫిర్యాదు చేసే అవకాశం ఉందన్నారు. ప్రజలు తమ అర్జీలను 1100 మీకోసం కాల్ సెంటర్‌కు ఫోన్ చేసి నమోదు చేయ వచ్చన్నారు. ఫిర్యాదు పరిష్కార స్థితిని తెలుసుకోవచ్చునన్నారు.

కూటమి వశం కానున్న నిడదవోలు వైస్ చైర్మన్ పదవి

- నేడు వైస్ చైర్మన్ పదవికి ఎన్నిక
- కౌన్సిల్‌లో 15కు పెరిగిన బలం
- రతీదేవి, కారింకి మధ్య పోటీ

నిడదవోలు, జూన్ 1(ఆంధ్రజ్యోతి) : నిడదవోలు మునిసిపల్ వైస్‌చైర్మన్ పదవి కూటమి వశం కానుంది.ఇప్పటి వరకూ వైసీపీ ఖాతాలో నిడదవోలు వైస్‌చైర్మన్ పదవి ఉండేది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న గంగుల వెంకటలక్ష్మి వ్యక్తిగత కారణాలతో పదవికి రాజీనామా చేసి జనసేన తీర్థం పుచ్చుకున్నారు.ప్రస్తుతం వైసీపీకి చెందిన యలగాడ బాలరాజు వైస్ చైర్మన్‌గా ఉన్నారు. ఇదిలా ఉండగా సోమవారం కౌన్సిల్‌లో వైస్‌చైర్మన్ పదవిపై ప్రత్యక్ష ఎన్నికలకు దిగుతున్నారు. మునిసిపల్ కౌన్సిల్‌లో 14 మంది వైసీపీ కౌన్సిలర్లు ఉండగా ఒకరు విదేశాలకు వెళ్లడంతో ప్రస్తుతం 13 మంది ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. వైసీపీ నుంచి జనసేనలోకి వచ్చిన 13 మంది కౌన్సిలర్లు ఉండగా టీడీపీకి చెందిన ఒక కౌన్సిలర్, మంత్రి దుర్గేష్‌కు ఓటు హక్కు ఉండడంతో కూటమి బలం 15కి చేరింది.ఈ నేపథ్యంలో నేడు వైస్‌చైర్మన్ గిరీపై జరిగే ప్రత్యక్ష ఎన్నికలో కూటమి అభ్యర్థి విజయం సాధించేందుకు అన్ని అవకాశాలు మెండుగా ఉన్నాయి.వైస్ చైర్మన్ పదవికి పువ్వుల రతీదేవి,కారింకి నాగేశ్వరరావు పోటీపడుతున్నారు. మునిసిపాలిటీలో సోమవారం జరగనున్న వైస్‌చైర్మన్ ఎన్నికల ప్రక్రియపై కమిషనర్ తోట కృష్ణవేణి ఎటువంటి సమాచారాన్ని తెలియచేయకుండా వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలున్నాయి.

ఎమ్మెల్యే లేక ఆగిన రేషన్?

రాజమండ్రిలో నేటి నుంచి పంపిణీ

రాజమహేంద్రవరం, జూన్1 (ఆంధ్రజ్యోతి) : రాజమహేంద్రవరం సిటీలో ఆదివారం రేషన్ పంపిణీ జరగలేదు. నగరంలో ఉన్న 105 చౌకధరల డిపోలు వద్దకు అధికారులు వచ్చి కేవలం లాగిన్ అయ్యారు. రెండు మూడు కార్డులకు మాత్రమే సరుకులు సరఫరా చేసినట్టు చెబుతున్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు వేరే ప్రాంతాల్లో ఉండడంతో ఆదివారం రాలేకపోవడంతో ఆగినట్టు సమాచారం. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకూ లాలాచెరువు, రాందాసుపేట,తుమ్మలోవ,అంబేడ్కర్ నగర్‌లలో రేషన్ పంపిణీ ప్రారంభిస్తారు.



ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా

నేడు జవహర్ ప్రమాణస్వీకారం

కొవ్వూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్‌గా సోమవారం బాధ్యతలు చేపట్టనున్నట్టు మాజీ మంత్రి కె.ఎస్. జవహర్ తెలిపారు. కొవ్వూరులో నివాసం నుంచి సోమవారం ఉదయం 7 గంటలకు విజయవాడ ర్యాలీగా వెళతామన్నారు. ఆదివారం జవహర్‌ను ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, గోపాలపురం ఎమ్మార్పీఎస్ నాయకులు కలిశారు.

ప్రభుత్వాసుపత్రిలో అన్నసమారాధన


రోగులకు అన్నప్రసాదం అందిస్తున్న చిట్టి ఆటో మొబైల్స్ అధినేత రాము

నిడదవోలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి సేవా సంస్థ ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీన పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలోని రోగులకు, వారి సహాయకులకు పౌష్టికాహారం (అన్నసమారాధన)అందిస్తామని లయన్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు, చిట్టి ఆటో మొబైల్స్ అధినేత కేఎస్ఎస్ రాము తెలిపారు. ఆదివారం ఆసుపత్రిలో సత్యసాయి సేవాసంస్థల ద్వారా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రోగులు, వారి సహాయకులకు అన్నసమారాధన నిర్వహించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు ఎస్‌వీవీ సత్యనారాయణ, ఎం.కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

'ప్రజా సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట'


రేషన్ పంపిణీని ప్రారంభిస్తున్న కూటమి నేతలు

నిడదవోలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు రేషన్ డిపోల వద్ద కూటమి నాయకులు ప్రత్యేక పూజలు నిర్వహించి లబ్ధిదారులకు రేషన్ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే బియ్యం రేషన్ షాపుల ద్వారా అర్హులైన లబ్ధిదారులకు అందించాలనే సదుద్దేశంతోనే ఈ వ్యవస్థను మళ్లీ తీసుకువచ్చిందన్నారు.

కార్యక్రమంలో జనసేన పట్టణ అధ్యక్షుడు రంగా రమేష్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు మోర్త ప్రమోద్ కుమార్, తిరుపతి సత్యనారాయణ, కూటమి నాయకులు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అందించిన సేవలే గుర్తింపునిస్తాయి : ఎమ్మెల్యే


సాయిబాబు దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు తమ విధి నిర్వహణలో అందించిన సేవలే గుర్తింపునిస్తాయని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని యువరాజ్‌మాల్ హాలులో ఆదివారం మున్సిపల్ మేనేజర్ పీ. సాయిబాబు పదవీ విరమణ సభ జరిగింది. దీనికి మున్సిపల్ కమిషనర్ టీ. నాగేంద్రకుమార్ అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై సాయిబాబు దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, సూరపనేని చిన్ని, పిల్లలమర్రి మురళీకృష్ణ, కంటమణి రమేష్‌బాబు, మున్సిపల్ ఉద్యోగులు, బంధువులు, కుటుంబ సభ్యులు, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, సచివాలయ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవాలి


యోగాసనాలు వేస్తున్న ఉద్యోగులు

కొవ్వూరు, జూన్1 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం పెంపొందించుకోవాలని తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్థానిక ఆం ధ్రాగీర్వాణ విద్యాపీఠం ప్రాంగణంలోని సంస్కృ త కళాశాలలో ఆదివారం యోగాపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రైనీలు పెనుమత్స సత్యనారాయణరాజు, సరోజినీ సదస్సులో పాల్గొన్న వివిధ ప్రభుత్వశాఖల ఉద్యోగులకు యోగాపై అవగాహన కల్పించి, యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టీ.నాగేంద్రకుమార్, ఆయుష్ వైద్యురాలు కే. శ్రీవిద్య, ఎంఈవో రామకిషోర్, ఉపాధ్యాయ సిబ్బంది, వార్డు సెక్రటరీలు, హెల్త్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

నిడదవోలు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క వాహనదారుడు డ్రైవింగ్ సమయంలో వాహనాలకు సంబంధించిన పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలని సమిశ్రగూడెం ఎస్ఐ బాలాజీ పేర్కొన్నారు. ఆదివారం సమిశ్రగూడెం బ్రిడ్జి సమీపంలో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన పత్రాలు చూపని పలువురు వాహనదారులపై కేసులు నమోదు చేశారు.

వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసింది

● అందుకే మళ్లీ పాత విధానంలో రేషన్ పంపిణీ : ఎమ్మెల్యే ముప్పిడి


పట్టణంలో రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు

కొవ్వూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇంటింటికీ రేషన్ డోర్ డెలివరీ పేరుతో గత వైసీపీ ప్రభుత్వం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణం, మండలంలోని నందమూరులో ఆదివారం రేషన్ దుకాణాలను పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగు రోడ్ల కూడలిలో వాహనం నిలుపుదల చేసి ప్రజలకు ఇబ్బందులపాలు చేసిందన్నారు. రేషన్ వాహనం ఏ రోజు, ఏ సమయానికి వస్తుందో తెలీక పేద ప్రజలు తమ పనులు మానుకుని ఎదురు చూడాల్సి వచ్చేదన్నారు. ఆ ఇబ్బందులను గుర్తించిన కూటమి ప్రభుత్వం మరలా పాత విధానంలో రేషన్ డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేస్తుందన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు డోర్‌డెలివరీ చేయాలని డీలర్లను ఆదేశించడం జరిగిందన్నారు. రేషన్ పంపిణీలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రజలకు సరుకులు పంపిణీచేయాలని డీలర్లను సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎం. దుర్గాప్రసాద్, సీఎస్‌డీటీ సునీత, టీడీపీ పట్టణ అధ్యక్షులు దాయన రామకృష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపనేని చిన్ని, కౌన్సిలర్లు పిల్లలమర్రి మురళీకృష్ణ, కిలాని వీర వెంకటలక్ష్మి, సర్పంచ్ కంటిపూడి గంగాభవాని, ఎంపీటీసి కంటిపూడి నవ్య, కూటమి నేతలు అర్జిల్లి రామకృష్ణ, బీవీ ముత్యాలరావు, సుంకర సత్తిబాబు, అచ్యుతరాయుడు, మాజీ సర్పంచ్ కంటిపూడి శ్రీనివాస్, గోపీ, వేమగిరి వెంకట్రావు, తదితరులు పాల్గొన్నారు.

'అవకతవకలు అడ్డుకట్ట వేసేందుకే


గోపాలపురంలో చౌక దుకాణంలో బియ్యం పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి

గోపాలపురం, జూన్1 (ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థలో అవకతవకలను అడ్డుకట్ట వేసేందుకే రేషన్‌డీలర్ల వ్యవస్థను ప్రభుత్వం పునఃప్రారంభించిందని ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు అన్నారు. గోపాలపురంలోని నాలుగో నెంబర్ చౌకదుకాణంలో ఆయన రేషన్ డీలర్ల ద్వారా బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ప్రతిరోజూ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు షాపులు ఉంటాయన్నారు. మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ, పట్టణ అధ్యక్షుడు జ్యేష్ట శ్రీధర్, మాజీ ఎంపీటీసీ సభ్యులు కూనపం ప్రసాద్‌బాబు, మాజీ గ్రామ కమిటీ అధ్యక్షులు రమేశ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ పడమట శ్రీనివాస్, తహశీల్దార్ అజయ్‌బాబు, ఆర్ఐ సునీత, సివిల్ సప్లై డీటీ దివాకర్, సీనియర్ నాయకులు కొర్లపాటి రాము, జ్యేష్ట శ్రీనివాసరావు, కొడవటి చిన వెంకటేశ్, తానేటి రాఘవులు, వీఆర్వో శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కొవ్వూరు జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా షేక్ రజియా

కొవ్వూరు, జూన్ 1(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా షేక్ రజియా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆదివారం ఆమెను ఏపీటీఎఫ్ నాయకులు కలిసి అభినందించారు. రాజమహేంద్రవరం ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో బయాలజీ ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడకు వచ్చారు. ఆమెను కలిసినవారిలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు దున్న దుర్గారావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సలీం, జికృష్ణ, జానీ మాస్టారు, చాగల్లు ఎంఈవో -2 సుభాకర్, నూతంగి రామకృష్ణ, శాంసన్ ఉన్నారు.

ఇకపై డ్రోన్ కెమెరాతో పహారా

తాళ్లపూడి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు మండలంలోని పలు గ్రామాలలో డ్రోన్ సహాయంతో ఫొటోలు, వీడియోలు చిత్రీకరించి ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే ఉక్కుపాదం మోపుతామని ఎస్ఐ తోట రామకృష్ణ తెలిపారు. తుపాకులగూడెంలోని శివారు ప్రాంతం కొండల్లో ప్రక్కిలంక లంకల్లో విజువల్స్ చిత్రీకరించామని తెలిపారు. డ్రోన్ ఆపరేటర్, పోలీసు సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు.

రేషన్ సక్రమంగా అందజేయాలి : తహశీల్దార్

దేవరపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నిత్యవసర సరుకులను డీలర్లు లబ్ధిదారులకు సక్రమంగా అందజేయాలని తహశీల్దార్ ఎం. శ్రీనివాస్ పేర్కొన్నారు. దేవరపల్లిలో సొసైటీ వద్ద ఆదివారం చౌకడిపో ద్వారా రేషన్‌కార్డు హోల్డర్స్‌కు సరుకులు తహశీల్దార్, కూటమి నాయకుల చేతులమీదుగా ఆదివారం అందజేశారు. టీడీపీ నేతలు గన్నమని హరికృష్ణ, ఉప్పులూరి రాంబాబు, యాగంటి వెంకటేశ్వరరావు, నందిగాం శ్రీధర్, సివిల్ డీటీ సత్యనారాయణ, సొసైటీ రేషన్ డిపో సిబ్బంది పసుపులేటి రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి గ్రంథాలయాధికారిగా సత్యనారాయణ బాధ్యతలు

దేవరపల్లి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దేవరపల్లి గ్రంథాలయాధికారిగా సత్యనారాయణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాభివృద్ధికి దాతలు సహకరించాలన్నారు. గ్రంథాలయంలోని వివిధ పుస్తకాలు, పోటీపరీక్షలకు సంబంధించిన పుస్తకాలు, వార్తపత్రికలు అన్నీ ఉన్నాయని, విద్యార్థులు వేసవిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. తాను గోపాలపురం గ్రంథాలయం నుంచి బదిలీపై ఇక్కడకి వచ్చానని చెప్పారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం


సూరిబాబుకు సాయం అందిస్తున్న దృశ్యం

తాళ్లపూడి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పెద్దేవంలో పక్షవాతంతో బాధపడుతున్న బొర్రా సూరిబాబుకు వైద్యం నిమిత్తం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రూ. 11700 ఆర్థిక సహాయాన్ని ఆదివారం అందించినట్టు ఆ సంస్థ కార్యదర్శి నామన బుల్లిరాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వ ర్యంలో చేసే కార్యక్రమాల లో వైద్యానికి పెద్దపీట వేస్తూ వస్తున్నామన్నారు. సంస్థ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నల్లజర్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అనంతపల్లి హైవేలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రకాశరావుపాలెంకి చెందిన చికిలే వెంకటేశు (34) అక్కడికక్కడే మృతి చెందాడు. ఈయన యర్నగూడెం వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి వ్యాన్ ఢీకొంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ సరుకులు : మంత్రి


సత్యవాడలో సరుకుల పంపిణీని ప్రారంభిస్తున్న మంత్రి దుర్గేష్, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే శేషారావు

ఉండ్రాజవరం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్‌షాపు ద్వారా నిత్యావసరసరుకులు అందిస్తామని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం సత్యవాడలో రేషన్‌షాపుల ద్వారా సరుకుల పునఃపంపిణీని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ పేదలకు చౌకధరల దుకాణాలు ద్వారా సరుకులను స్వయంగా తీసుకునే కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చామన్నారు. 15 రోజుల పాటు షాపుల్లో అందజేస్తామని చెప్పారు. జాయింట్ కలెక్టర్ ఎస్. చినరాముడు, ఆర్డీవో రాణీసుస్మిత, సివిల్ సప్లై జిల్లా అధికారి ఎంఆర్ ప్రేమ్‌కుమార్, తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో రామారావు, అధికారులు, డీలర్లు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

గోదావరి నదిలో మృతదేహం లభ్యం

● మంగళగిరి వాసిగా గుర్తింపు

కొవ్వూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : గోదావరి నదిలో గుర్తుతెలియని మృతదేహాన్ని కొవ్వూరు పట్టణ పోలీసులు ఆదివారం సాయంత్రం గుర్తించారు. స్థానిక లాంచీలరేవు సమీపంలో మృతదేహం తేలిఉందని సమాచారం రావడంతో పట్టణ సీఐ పి. విశ్వం సంఘటనా స్థలానికి చేరుకుని స్థానికుల సహాయంతో మృతదేహాన్ని బయటకు తీయించారు. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి వద్ద లభించిన ఆధార్‌కార్డు ఆధారంగా గుంటూరు జిల్లా మంగళగిరి బాలాజీనగర్‌కు చెందిన మందిశెట్టి శ్రీనివాసరావు (55)గా గుర్తించారు. ఈ మేరకు ఆయన కుటుంబసభ్యులకు సమాచారం అందజేసినట్టు పోలీసులు తెలిపారు.

ఇబ్బందులు అధిగమించేందుకే.. రేషన్ షాపుల ద్వారా సరుకుల పంపిణీ : ఎమ్మెల్యే


చాగల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

చాగల్లు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విధానంలోని ఇబ్బందులు అధిగమించడానికే రేషన్‌షాపుల ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీని పునఃప్రారంభించినట్టు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం చాగల్లులో నిత్యావసర సరుకులు రేషన్‌షాపుల ద్వారా పంపిణీ చేసే విధానాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ ప్రజల కోరిక మేరకే రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు చెప్పారు. రోజు కూలీకి వెళ్లేవారు రేషన్ సరుకులు తీసుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారని, నిర్దిష్ట సమయాలలో ఎప్పుడైనా తీసుకునే విధంగా పాత విధానం సౌలభ్యంగా ఉందన్నారు. వృద్ధులు, దివ్యాంగులకు మాత్రం వారి ఇంటి వద్దనే అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, టీడీపీ నేతలు కేతా సాహెబ్, గారపాటి శ్రీనివాసరావు, దొంగ రామకృష్ణ, తాళ్లూరి ప్రసాద్, నందిగం శ్రీను, తహశీల్దార్ ఎం.మెరికమ్మ, సర్పంచ్ ఉన్నమట్ల మనశ్శాంతి, కూటమినేతలు తాళ్లూరి వరప్రసాద్, మిరియాల సతీష్, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదో రోజుకు రేగులమ్మ జాతర


పెద్దాపురంలో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

గోపాలపురం, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలో జరుగుతున్న గ్రామదేవత రేగులమ్మ జాతర మహోత్సవం 8వ రోజుకు చేరుకుంది. ఆదివారం 200 మంది మహిళలు కళాశాలతో, తీన్‌మార్ డప్పులతో గరగనృత్యాలతో గ్రామ పురవీధుల్లో అమ్మవారిని ఊరేగించారు. 8వ తేదీతో జాతర మహోత్సవం ముగుస్తుందని జాతర కమిటీ సభ్యులు తెలిపారు.

రేషన్ సరుకుల పంపిణీ ప్రారంభం

తాళ్లపూడి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు రేషన్‌షాపుల వద్దే రేషన్ తీసుకునే విధానాన్ని ఆదివారం ప్రారంభించారు. అన్నదేవరపేటలో ఇన్‌చార్జి తహశీల్దార్ మోహనభారతి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడుతూ మండలంలో 34 రేషన్ షాపులు ఉన్నాయన్నారు. ఈ షాపులలో ప్రతి నెలా ఒకటో తారీఖు నుంచి 15 వరకు ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ, తిరిగి సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి ఎనిమిది గంటల వరకు రేషన్ అందిస్తారని తెలిపారు. కార్యక్ర మంలో కొఠారు వెంకట్రావు, కూచిపూడి గణపతి, తదితరులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాలలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో రేషన్ షాపులను ప్రారంభించారు. తాళ్లపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు నామన పరమేశ్వరరావు, మలకపల్లిలో మద్దిపాటి ప్రకాశరావు, పోచవరంలో నాయకుడు అనపర్తి ప్రసాద్, చలపాటి ప్రకాష్, ప్రక్కిలంకలో యాళ్ల బాబూరావు, తిరుగుడుమెట్టలో అన్నమరెడ్డి సత్తిబాబు, పెద్దేవంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, తదితరులు పాల్గొనిషాపులను ప్రారంభించారు.

పోతవరంలో ఉచిత మెగా వైద్యశిబిరం

నల్లజర్ల, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతవరంలో గంగానమ్మ జాతర సందర్భంగా హైదరాబాద్ హైకాన్ ఆసుపత్రి డాక్టర్ డీవీ కృష్ణారావుతోపాటు సిబ్బంది వచ్చి శ్రీశ్రీ ఫంక్షన్ హాలులో ఆదివారం మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. దీన్ని మాజీ సర్పంచ్ పసుమర్తి రతీష్, గన్నమనేని వెంకటేశ్వరావు, ఉప సర్పంచ్ ఏలేటి సత్యనారాయణ ప్రారంభించారు. 500 మంది పేషంట్లకు వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. డాక్టర్ నవ్య, డాక్టర్ రాజేష్, డాక్టర్ శోభన, డాక్టర్ ముకుంద్, డాక్టర్ సురేష్‌రెడ్డి, పెండ్యాల వీరాఘవులు, కొఠారి వెంకటేశ్వరరావు,ప్రత్తిపాటి కృష్ణసర్పంచ్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

'కూటమి ప్రభుత్వం మోసం చేసింది'

కొవ్వూరు, జూన్ 1 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం మోసపూరిత హామీలతో రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం వెంకట్రావు ఆధ్వర్యంలో వెనుపోటు దినం పోస్టర్‌ను ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ ప్రసాద్, కంటమణి రమేష్‌బాబు, గండ్రోతు సురేంద్ర, కవల నాగేశ్వరరావు, తాతా కృష్ణారావు, పరిమి సోమరాజు, అలీ, తదితరులు పాల్గొన్నారు.